Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 236 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 15 సెప్టెంబర్ 2023 | శుక్రవారం | పేజీలు : 4

## 'మేక్ ఇన్ ఇండియా'లో భారత్ భేష్

న్యూఢిల్లీ : భారత్ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంపై రష్యా ప్రశంసలు కురిపించింది. 'మంచి కార్యక్రమం తీసుకున్నారు' అని ప్రధాని మోదీని రష్యా అధ్యక్షుడు పుతిన్ కొనియాడారు.

ఇలాంటి కార్యక్రమాన్ని తమదేశంలోనూ అమలు చేయాలని ఉందని పుతిన్ అన్నారు. రష్యాలోని వ్లాదివోస్తోక్‌లో జరిగిన ఎనిమిదవ ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, ఢిల్లీ జీ-20 సదస్సు వేదికగా అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, యూరోపియన్ యూనియన్, యూఏఈ, భారత్ ప్రకటించిన 'ఇండియా-మిడిల్ ఈస్ట్- యూరప్ ఎకనామిక్ కారిడార్'ను పుతిన్ స్వాగతించారు. ఈ కారిడార్ రష్యా, చైనా ప్రయోజనాలను దెబ్బతీస్తుందనే వాదనను ఆయన కొట్టిపడేశారు.

# మహానగర పేదల కల పండేలా...

# ఇండ్ల పండుగ




### రెండో విడత డబుల్ ఇండ్లకు లక్కీ డ్రా.. రిజర్వేషన్ల వారీగా లబ్ధిదారుల ఎంపిక

## జీహెచ్ఎంసీ పరిధిలోని 24 నియోజకవర్గాలకు..

## హైదరాబాద్ కలెక్టరేట్‌లో పారదర్శకంగా ప్రక్రియ

## ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ ద్వారా ఇండ్ల కేటాయింపు

హైదరాబాద్ : మహానగరంలో పేదలకు సొంతింటి కలను సాకారం చేసే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం మరోమారు ఇండ్లను కేటాయించనున్నది. ఇప్పటికే తొలివిడతలో 11,700 మందికి డబుల్ ఇండ్లను కేటాయించగా, ఈ నెల 15న రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు రంగం సిద్ధమైంది. గ్రేటర్‌లోని 24 నియోజకవర్గాల్లో మొత్తం 13, 300 మందికి డబుల్ ఇండ్లను కేటాయించనున్నారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఎంపికలో రిజర్వేషన్ల విధానాన్ని పాటిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 500పైగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులను ఆన్‌లైన్ లాటరీ విధానం ద్వారా ఎంపిక చేసి ర్యాండమైజేషన్ పద్ధతిలో ఇండ్లను కేటాయిస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 24 నియోజక వర్గాల వారీగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపును ఎన్ఐసీ వెబ్ పోర్టల్ సహాయంతో లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

అధికారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు.

మొదటి దశ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపు ప్రక్రియ ఇదే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా 15 నియోజక వర్గాలలో విజయవంతమైందని, అదే స్ఫూర్తితోనే రెండో దశ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు మొత్తాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15న జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆన్‌లైన్ లాటరీ విధానం ద్వారా లబ్ధిదారులకు ఇండ్లు కేటాయిస్తామన్నారు. ఎలాంటి రాజకీయాలకు ఆస్కారం లేకుండా, పూర్తిగా పారదర్శకంగా లాటరీ విధానం ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగుల వారీగా రిజర్వేషన్లు పాటిస్తూ లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని తెలిపారు. నియోజకవర్గానికి 500 చొప్పున లబ్ధిదారులను ఎంపికచేస్తున్నామని పేర్కొన్నారు.



## తెలంగాణలో మరో రెండురోజులు అతిభారీ వర్షాలు..!

తెలంగాణలోని పలు జిల్లాల్లో రాగల రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతవరణ కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. అల్పపీడనం వాయుగుండంగా మారుతుందని అంచనా వేసింది. అయితే, గురువారం నుంచి శుక్రవారం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు.. నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వెల్లడించింది. రెండురోజులు పలు చోట్ల ఉరుములు, మెరుపులతో వానలు పడే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గత 24గంటల్లో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా మంచిర్యాల జిల్లా వేమనపల్లిలో 15 సెంటీమీటర్లు, కన్నెపల్లిలో 12.2, ఆసిఫాబాద్ దహెగాంలో 13.4, పెంచికల్‌పేటలో 11.9 సెంమీమీటర్ల వర్షాపాతం నమోదైంది.

## బీజేపీ పోరాటాలను అణచివేసేందుకు కేసీఆర్ యత్నం

హైదరాబాద్: బీజేపీ పోరాటాలను అణిచి వేసేందుకు కేసీఆం) ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం బీజేపీ కార్యాలయంలో 24 గంటల ఉప వాస దీక్షను విరమించిన అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణలో ఏ ఒక్క వర్గానికి నిరసన తెలియజేసే పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. బయట ఉద్యమాలు చేయవద్దు, అసెంబ్లీలో మాట్లాడవద్దు అన్నట్లు కేసీఆర్ వ్యవహరిస్తున్నారన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తుంటే బీజేపీ కార్యకర్తలపై విపరీతంగా దాడులు చేశారని.. ఈ దాడులలో అనేక మంది కార్యకర్తలకు గాయాలయ్యాయన్నారు. "నీవు తెలంగాణ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కోరాం. తెలంగాణ వేస్తే నా తమ్ముళ్లకు, అన్నలకు, అక్కలకు, చెల్లెళ్లకు ఉద్యోగాలు వస్తాయని లేఖలు రాసి ఆత్మహత్య చేసుకున్నారు. కారుకూతలు కూసే కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ నేతలు హామీ లను నెరవేర్చలేదు. నాకు ఉద్యోగం రాదన్న బాధతో మరోమారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు యువత. తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ఒక్క టీచర్, లెక్షరర్, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయని దుర్మార్గపు ప్రభుత్వం ఇది. నియామక పరీక్షలు నిర్వహించే టీఎస్పీఎస్సీలో కూడా ఖాళీలు ఉన్నాయి. ప్రతి నెలా ఎలాంటి లోటూ పాట్లు లేకుండా కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో నియామకాలు చేస్తున్నాం. పేపర్ లీకేజ్ అయితే పరీక్షలకు సిద్ధమైన యువకులు కుటుంబం ఎంత



బాధపడుతుందో ఆలోచన చేశావా కేసీఆర్. ఆ నాడు 369మంది యువకులు పోలీసు తూటాలకు బలైంది ఈ నియామకాల కోసమే . తెలంగాణ ఉద్యమంలో కూడా ఈ స్థాయి లో అప్పటి ప్రభుత్వం ఇంత దుర్మార్గంగా వ్యవహరించలేదు. నేడు పోలీసులు వ్యవహరించిన తీరుగా ఉద్యమంలో పోలీసులు వ్యవహరించి ఉంటే నీ కొడుకు, కూతురు అమెరికా పారిపోయే వారు.కేసీఆర్ ఏనాడూ సకల జనుల సమ్మె, సాగర హారంలో పాల్గొన లేదు. ఉద్యమ పోరాటం నుంచి పారిపోయిన వ్యక్తి మీ అయ్య కేటీఆర్. మీ సర్టిఫికెట్ మాకు అవసరం లేదు. ప్రజల ఆశీస్సులు మాపై ఉన్నాయి. తెలంగాణ రాకముందు మనను కాంగ్రెస్ పార్టీ దోచుకుంది .. ఉద్యమకారులను కాల్చి చంపింది. కాంగ్రెస్ హయాంలో పోలీసులు కాల్పులు తెలంగాణ ప్రజలు మరువకూడదు. తెలంగాణ సమాజంపై కాంగ్రెస్ పార్టీ దుర్మార్గంగా వ్యవహరించిందో ప్రజలు గుర్తుంచుకోవాలి. ఎన్నికల్లో చిన్న పొరపాటు జరిగినా ప్రజాస్వామ్యం మరచిపోవాలి.. నిజాం పాలన ఎదురు చూడాల్సి వస్తుంది. తెలంగాణ సమాజమా మేలుకో .. అర్థం చేసుకోండి. సోనియా, కేసీఆర్ కుటుంబాలు అత్యంత సన్నిహితమైన కుటుంబాలే. కాంగ్రెస్‌ను సమర్థిస్తే బీఆర్ఎస్‌ను సమర్థించినట్టే... బీఆర్ఎస్‌ను సమర్థిస్తే కాంగ్రెస్‌ను సమర్థించినట్టే. ఈ రెండు పార్టీలు తెలంగాణా ప్రజల పాలిట శాపంగా మారుతాయి. ఈ రెండు పార్టీలకు గురువు అసదుద్దీన్ ఓవైసీ... ఆయన ఏది రాసిస్తే వాళ్ళు అదే మాట్లాడుతారు. మీ కుటుంబం నుంచి మేం పాటాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు కేసీఆర్. కల్వకుంట్ల కుటుంబం, ఎంఐఎం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుంది. బీజేపీ అధికారంలోకి వస్తే అన్ని ఖాళీలను భర్తీ చేస్తుంది. ఎలాంటి పొరపాట్లు లేకుండా యూపీఎస్సీ తరహాలో టీఎస్పీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇస్తాం. నిరుద్యోగుల ఆకాంక్ష లు నెరవేరుస్తాం... ముద్రా రుణాల ద్వారా యువతను ఉద్యోగాలు ఇచ్చే లా తీర్చి దిద్దుతాం. నిన్న (బుధవారం) ఇందిరా పార్క్‌లో బీజేపీ కార్యకర్తలు పోలీసులకు చెమటలు పట్టించి, కేసీఆర్ గుండెల్లో గుబులు రేపేలా చేసిన వారికి నేను సెల్యూట్ చేస్తున్నాను" అంటూ కిషన్ రెడ్డి పేర్కొన్నారు.




ఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో శుక్రవారం విచారణకు రావాలని నోటీసులు పంపిం చింది. వివరాల ప్రకారం.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మొదటి నుంచి ట్విస్టులు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. తాజాగా మరోసారి ఈడీ.. ఎమ్మెల్సీ కవితకు నోటీసులు పంపించింది. ఈ సందర్భంగా రేపే విచారణను రావాలని నోటీసుల్లో పేర్కొనడం గమనార్హం. అయితే, ఈ కేసులో అరుణ్ రామచంద్రపిళ్లై నిన్ననే అప్రూవర్‌గా మారారు. ఈ విషయంలో ఆయన ప్రత్యేక జడ్జి ఎదుట వాంగ్మూలం ఇవ్వగా దాన్ని ఈడీ అధికారులు రికార్డు చేసినట్లు సమాచారం. లిక్కర్ స్కాం కేసులో గత ఏడాది మార్చి 7న అరుణ్ రామచంద్ర పిళ్లైని ఈడీ అధికారులు అరెస్టు చేశారు. ఆయన నుంచి పలు అంశాలు రాబట్టారు. ఈ విచారణ సమయంలోనే అరుణ్ రామచంద్ర పిళ్లై అప్రూవర్‌గా మారినట్లు దర్యాప్తు సంస్థ అధికారులు తెలిపారు. పిళ్లై వాంగ్మూలం ఆధారంగా విచారణకు రావాలంటూ కవితకు ఈడీ అధికారులు సమన్లు జారీ చేశారు. ఆమెను విచారించారు. ఈ ఏడాది మార్చి 11వ తేదీన ఈడీ ఎదుట కవిత విచారణకు హాజరయ్యే సమయంలో పిళ్లై తన నిర్ణయం మార్చుకున్నారు. ఈడీ అధికారులు తనపై ఒత్తిడి చేసి కవిత పేరు చెప్పించారంటూ ఢిల్లీ రౌస్ అవెన్యూలోని సీబీఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ విచారణ కొనసాగుతుండగానే తాజాగా ఆయన మరోసారి అప్రూవర్‌గా మారినట్లు తెలిసింది.




## ఆర్టీసీ విలీన బిల్లుకు గవర్నర్ తమిళిసై ఆమోదం

హైదరాబాద్ : టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లుకు గవర్నర్ తమిళిసై ఆమోదం తెలిపారు. తాను చేసిన 10 సిఫారసుల విషయంలో ప్రభుత్వ స్పందనపై సంతృప్తి చెందిన గవర్నర్ తాజాగా ఆ బిల్లును ఆమోదిస్తూ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు గవర్నర్ అభినందనలు తెలిపారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ తెలంగాణ ప్రభుత్వం శాసన సభలో బిల్లులను ప్రవేశపెట్టింది. వాటిని గవర్నర్‌కు పంపించగా.. ఆమె కొన్ని అంశాలపై అధికారుల వివరణ అడిగారు. అంతేకాకుండా 10 సిఫారసులు చేశారు. వీటిపై ప్రభుత్వ వివరణతో సంతృప్తి చెందిన తమిళిసై.. తాజాగా బిల్లుకు ఆమోదం తెలిపారు. ప్రజారవాణా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు, సేవలను ఇంకా విస్తృతపరిచేందుకు సంస్థలో పనిచేస్తున్న వారందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఇటీవల మంత్రి మండలి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆర్టీసీ కార్మికులు గతంలో సమ్మె చేసిన అంశాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ సానుకూల నిర్ణయం వెలువరించింది. దీనిపై విధివిధానాలు, నిబంధనలను రూపొందించేందుకు రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఆర్అండ్ బీ, రవాణాశాఖ, జీఏడీ శాఖ కార్యదర్శులు, కార్మికశాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించిన బిల్లును వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టి.. తుది ఆమోదం కోసం గవర్నర్‌కు పంపింది. తాజాగా ఈ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడంతో.. తెలంగాణ ఆర్టీసీలో పనిచేస్తున్న మొత్తం 43,373 మంది ఉద్యోగులు ప్రభుత్వోద్యోగులుగా మారనున్నారు.

## సంపాదకీయం

### యాపిల్ కు చైనా సెగ...

ఎదురుపడినప్పుడు షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడం, భుజాలు తట్టుకుని అభినందించుకోవడం, ఫోటోలకు నవ్వుతూ ఫోజులివ్వడం వరకూ బాగానే ఉంటుంది కానీ... లోపల మాత్రం ఒకరిపై ఒకరు కుతకుత లాడిపోతుంటారంటూ కామెంట్లు వినిపిస్తుంటాయి. అవి ఏయే దేశాల గురించి అన్నది తెలిసిందే. అగ్రరాజ్యం అమెరికా – మన పొరుగుదేశం చైనా గురించి! ప్రస్తుతం ఈ దేశాల మధ్య రివేంజ్ పాలిటిక్స్ నడుస్తున్నాయి. అయితే ఈ మధ్యలో యాపిల్ సంస్థ నలిగిపోతుంది. అవును... హీరో, విలన్ కొట్టుకుని మధ్యలో కమెడియన్ ని చంపేసినట్లు ఇప్పుడు అమెరికా – చైనా ల మధ్య సాగుతున్న కోల్డ్ వార్ లో యాపిల్ నలిగిపోతుందని తెలుస్తుంది. ఫలితంగా గతంలో ఎన్నడూ లేనంతగా షేర్ విలువ పడిపోతుందని, ఇదే సమయంలో యాపిల్ లో పెట్టుబడి పెట్టినవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. వివరాల్లోకి వెళ్తే%ా% ఈ ఏడాది తన మిత్రదేశాలైన జపాన్, నెదర్లాండ్స్ తో కలిసి చైనాకు చిప్ టెక్నాలజీ ఎగుమతులను అమెరికా కంట్రోల్ చేసింది. దీనికి రివేంజ్ గా తమదేశం నుంచి పశ్చిమ దేశాలకు సరఫరా అయ్యే రెండు కీలక పదార్థాల ఎగుమతులను చైనా నిలువరించింది. ఇదే సమయంలో దేశీయ చిప్ పరిశ్రమను బలోపేతం చేయడానికి ఏకంగా 40 బిలియన్ డాలర్లను కేటాయించింది. ఇదే సమయంలో అగ్రరాజ్యంపై మరింత కక్ష గట్టిన చైనా... తాజాగా ఐఫోన్ – 15 విడుదల నేపథ్యంలో మరో భారీ షాక్ ఇచ్చింది. ఇందులో భాగంగా... సెప్టెంబర్ 12న ఐఫోన్ – 15 విడుదలకు ముందు యాపిల్ పెట్టుబడిదారుల్లో భయాల్ని రేకెత్తించే నిర్ణయాలు తీసుకుంటుంది. దీంతో... యాపిల్ సంస్థ షేర్లు కేవలం రెండు రోజుల్లో 200 బిలియన్ డాలర్ల (రూ.16.63 లక్షల కోట్లు) మేర విలువ కోల్పోయాయి. దానికి కారణం... ఇటీవల చైనాలో ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ ఆఫీసు పనులకు యాపిల్ ఐఫోన్లు సహా ఇతర ఏ విదేశీ బ్రాండ్ ఫోన్లూ వాడొద్దని సూచించినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ సంచలన ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. దీంతో... త్వరలో ప్రభుత్వ ఆధీనంలోని ఇతర కంపెనీల ఉద్యోగులు కూడా యాపిల్ ఫోన్లను తీసుకురాకూడదని ఆదేశించే అవకాశం ఉందంటూ కథనాలు వెలువడటం మొదలయ్యాయి. దీంతో యాపిల్ కు ఉన్న అతిపెద్ద మార్కెట్లలో ఒకటైన చైనా... సుమారు యాపిల్ మొత్తం ఆదాయంలో 18 శాతం ఇచ్చే చైనా... ఉన్నఫలంగా ఇలాంటి నిర్ణయం తీసుకునే సరికి యాపిల్ ఒక్కసారిగా భారీగా 200 బిలియన్ డాలర్ల మేర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. మరోపక్క ఇటీవల చైనాకు చెందిన హువావే సంస్థ అత్యాధునిక మేట్ 60 ప్రో మొబైల్ ఫోన్ ను ఆవిష్కరించింది. దీనిలో చైనా తయారు చేసిన 5జీ కిరిన్ 9000ఎస్ ప్రాసెసర్ ను వాడింది. దీంతో... ఈ పరిణామం చైనా టెక్నాలజీ పరిశ్రమలో మేలిమలుపుగా నిపుణులు పేర్కొంటున్నారు. ఫలితంగా... ఇది కూడా యాపిల్ షేర్ల పతనానికి కారణమై ఉంటుందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. కాగా... యాపిల్ ఫోన్ల ఉత్పత్తి సంస్థ ఫాక్స్ కాన్ కు చైనాలో అతిపెద్ద తయారీ యూనిట్ ఉన్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో వాల్ స్ట్రీట్ లో అతిపెద్ద మార్కెట్ విలువ ఉన్న కంపెనీల్లో యాపిల్ కూడా ఒకటి. దీని మార్కెట్ విలువ సుమారు 2.8 ట్రిలియన్ డాలర్లు!

# ఆధార్ అనుసంధానిస్తేనే.. కూలీ భత్యం!




భూపాలపల్లి : ఉపాధి హామీ పథకాన్ని మరింత పటిష్ఠపర్చి ఎలాంటి అవినీతి, అవకతవకలకు తావు లేకుండా ఉండేలా, నిజమైన కూలీలకు లబ్ధి చేకూరేలా కూలీల ఆధార్‌ను జాబ్‌కార్డుతో అనుసంధానం చేస్తున్నారు. గ్రామీణ ప్రజల్లో వలసలను నివారించి సొంత ప్రాంతాల్లోనే పనులు కల్పించేలా కొన్నేళ్ల కిందట జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది.

ప్రజలు లబ్ధి పొందడంతో పాటు, గ్రామాభివృద్ధికి పలు రకాల పనులు చేపట్టడం, రైతులకు అవసరమయ్యేలా పనులు ఉండటంతో ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ముఖ్యమైన పథకంగా మారిపోయింది. జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో 2.41 లక్షల మంది ఉపాధి హామీ లబ్ధిదారులు ఉండగా సక్రమంగా పనులకు వెళ్తున్న కూలీలు 1.39 లక్షల మంది ఉన్నారు. ముందుగా సక్రమంగా ఉపాధి పనులకు వచ్చే వారి ఆధార్‌ను అనుసంధానం చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఇప్పటివరకు 1.37 లక్షల మంది రెగ్యులర్ కూలీల జాబ్‌కార్డులను ఆధార్‌కు అనుసంధానం పూర్తి చేశారు. ఇక నుంచి ఆధార్ కార్డును అనుసంధానం చేసుకున్న కూలీలకు మాత్రమే చేసిన పనికి సంబంధించిన నగదును వారి ఖాతాలో జమచేయనున్నారు. మరోవైపు ఆధార్ అనుసంధానం చేసిన కూలీలకు పనులు కల్పించాలంటే సంబంధిత కూలీల వివరాలను ఉపాధి హామీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వినియోగించాల్సి ఉంటుంది. ఆధార్, జాబ్‌కార్డులో పేర్లు ఒకేలా ఉన్నవారికి వెంటనే గుర్తింపు పూర్తవుతుండగా పేర్లలో స్వల్ప మార్పులు ఉన్నవారివి ఆలస్యం అవుతున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు.

మరింత పారదర్శకతగ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో సక్రమంగా పనులకు వెళ్తున్న వారితో పాటు అసలు ఎలాంటి పనులకు వెళ్లనివారికి సైతం కూలీ పనులకు వెళ్లినట్లు చూపిస్తూ నగదు పొందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పైరవీతో చాలా మంది కూలీ పనులకు వెళ్లకున్నా వెళ్లినట్లు చూపుతున్నారు. దీంతో అసలు కూలీలకు నష్టం కలుగుతోంది. ఇలాంటి సమస్యలను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకుంటున్న వారి ఆధార్ కార్డును జాబ్‌కార్డుతో అనుసంధానం చేసిన వారికి మాత్రమే వందశాతం పనులు కల్పించి వారికి మాత్రమే నగదు చెల్లింపులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

వారంలోగా వంద శాతం పూర్తి– పురుషోత్తం, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారిజిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీల ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని మరో వారం రోజుల్లో వందశాతం పూర్తి చేస్తాం.. ఆధార్ అనుసంధానం చేస్తేనే కూలీలకు నగదు చెల్లింపులు చేపట్టే అవకాశం ఉంటుంది. అనుసంధానం చేసుకోనటువంటి కూలీలు ఉంటే.. సంబంధిత గ్రామాల్లోని ఉపాధి హామీ క్షేత్రసహాయకులకు వివరాలను అందిస్తే వారు నమోదు చేస్తారు.

# ఖర్చులు ఎక్కువ.. రాబడి తక్కువ



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ బడ్జెట్ ఏటా పెరుగుతోంది.. దీనికి తగ్గట్లుగా ఖర్చులు కూడా అధికం అవుతున్నాయి. సొంత ఆదాయం సమకూర్చుకోవడంలో మాత్రం ఆసక్తి పెద్దగా చూపడం లేదు. ఆదాయ, వ్యయాలు సమానంగా ఉంటున్నాయి. రావాల్సిన పన్నులు, అక్రమ భవనాలను ఆరికట్టడం, లేఅవుట్లను ప్రోత్సహించడం, ప్రచార బోర్డులు, ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజు, దుకాణాల అద్దెలు, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లు అంతంత మాత్రమే ఉంటున్నాయి.

అనవసరమైనవే అధికం నగర పాలిక బడ్జెట్ వందల కోట్లు పెంచుతుండగా సొంత ఆదాయం రూ.వంద కోట్లు కూడా దాటడం లేదు. కోట్లాది నిధులు ఉన్నాయనే కారణంతో జిల్లా పాలనాపరంగా చేపట్టే కార్యక్రమాలను కూడా బల్దియాకే అప్పగిస్తున్నారు. కూడళ్లు, డివైడర్ల నిర్వహణ విషయంలో ఇప్పటికీ వివాదం తేలడంలేదు. అన్ని కూడళ్ల వద్ద ఇప్పటికే బోర్‌వెల్స్ వేశారు. వీటిని వినియోగించుకోవడం లేదు. ఈ పనులపై విజిలెన్స్ వరకు ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. రూ.లక్షల నిధులు అభివృద్ధికి దూరమవుతున్నాయి. పండగల ఖర్చులు పరిశీలిస్తే ఖమ్మం, నిజామాబాద్ నగరాల కంటే ఎక్కువగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం అన్ని డివిజన్లలో రహదారులు బాగు అయ్యాయి. శివారు ప్రాంతాల్లో మినహా మిగతా ప్రాంతాల్లో మొరం కోసం నిధులు కేటాయించకుండా పక్కాగా అధికారుల పర్యవేక్షణలో ప్యాచ్ చేస్తే ప్రయోజనం ఉంటుంది. వృథా ఖర్చులు తగ్గిస్తే సాధారణ నిధులు బల్దియా ఖాతాలో నిల్వ ఉండే అవకాశముంటుంది.

ప్రభుత్వ నిధుల మీదనే ఆశలు

మొత్తానికి 2023–24 సంవత్సరానికి రూ.621.43 కోట్లతో బడ్జెట్ అంచనాలు తయారు చేశారు. ఇందులో సొంత ఆదాయం రూ.74.15 కోట్లుగా చూపించగా రూ.74.13 కోట్లు ఖర్చులుగా నిర్ణయించారు. ప్రభుత్వ గ్రాంట్లు రూ.541.49 కోట్లుగా అంచనాలు వేశారు. వీటి మీదనే అభివృద్ధి పనులకు ఆశలు కలుగుతున్నాయి. ఈ ఏడాదిలో ముఖ్యమంత్రి హామీ నిధులు, రుణాలు మంజూరు కానుండటంతో ఇప్పటికే ఆయా పనులకు ప్రణాళికలు తయారు చేశారు. డివిజన్‌కు రూ.కోటి నుంచి రూ.10 కోట్ల వరకు నిధులు విడుదల చేసే అవకాశముంది.

శివారు ప్రాంతాలకు ప్రాధాన్యం

బడ్జెట్‌లో శివారు ప్రాంతాలకు సొంత నిధుల నుంచి 1/3వ వంతు నిధులు కేటాయిస్తుండగా దీంతో పాటు ఇతర నిధులు వెచ్చిస్తున్నారు. కేటాయిస్తున్న మొత్తం ఏ మూలకు సరిపోవడం లేదు. తీగలగుట్టపల్లి, సీతారాంపూర్, రేకుర్తి, ఆరెపల్లి, సదాశివపల్లి, వల్లంపహాడ్, అలుగునూర్ వంటి విలీన కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. రహదారులు, మురుగుకాలువలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సప్తగిరికాలనీ, టెలిఫోన్‌క్వార్టర్స్, శివనగర్, భగత్‌నగర్, రాంచంద్రాపూర్ కాలనీ, కట్టరాంపూర్, కోతిరాంపూర్, పోచమ్మవాడ, అలకాపురికాలనీ, గాయత్రీనగర్, లక్ష్మీనగర్, షాషాబ్ వీధి, పద్మశాలీ వీధి, బోయవాడ, రూరల్ పోలీసుస్టేషన్ ఏరియా, హుస్సేనీపుర, అశోక్‌నగర్, దుర్గమ్మగడ్డ, ఖాన్‌పుర, కిసాన్‌నగర్, సుభాష్‌నగర్, బ్యాంకుకాలనీ, మెహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో అదే పరిస్థితి.

# కలగానే బహిరంగ వ్యాయామశాల

కరీంనగర్ : పురపాలక సంఘం పరిధిలో బహిరంగ వ్యాయామశాల (ఓపెన్ జిమ్) ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. చొప్పదండిలోని ప్రధాన చౌరస్తాలో దీని ఏర్పాటుకు అంకురార్పణ జరిగినా పనుల ప్రారంభానికి అడ్డుగోడలు తొలగడంలేదు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిత్యం యువకులు పలు రకాల క్రీడలతోపాటు వ్యాయామాలు చేస్తుంటారు. రూ.15 లక్షలతో రెండు ఓపెన్ జిమ్ పరికరాలు మంజూరయ్యాయి. ఇది తెలిసి యువకులు ఎంతో సంతోషపడ్డారు. కానీ పరికరాలు వచ్చి నెలలు గడుస్తున్నా ఏర్పాటులో మాత్రం ఇబ్బందులు తప్పడంలేదు.పనులు అడ్డుకోవడంతో మొదలైన వివాదం పాఠశాల క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు పనులు ప్రారంభించగా పక్కనే ఉన్న ఓ సంఘం నాయకులు మైదానంలో తమకు కొంత స్థలం వస్తుందని నిర్మాణాలు చేయకుండా అడ్డుపడ్డారు. నిర్మాణ పనులు కొంత జరగగా వాటిని ధ్వంసం చేశారు. అప్పటి నుంచి స్థానిక యువత, క్రీడాకారులు వివాదాన్ని పరిష్కరించి నిర్మాణాలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. అయినా ఎలాంటి ఉపయోగం లేకుండాపోయింది. జిమ్ పరికరాలు పక్కనే ఉన్న పాఠశాల గదిలో పడేయడంతో అవి కాస్తా తుప్పుపట్టే దశకు చేరుకుంటున్నాయి. నిర్మాణ పనులు చేస్తుండగా ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసిన నేరస్థులు ఎవరనేది గుర్తించకపోవడంతో క్రీడాకారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

వివాదం పరిష్కారానికి పురపాలక సంఘం తీర్మానం

క్రీడా మైదానంలో తమకు కొంత స్థలం వస్తుందని ఓ సంఘం నాయకులు పనులు జరగకుండా అడ్డుపడుతున్నారు. ఈ వివాదాన్ని ముగించాలని పురపాలక సంఘం అధ్యక్షురాలు గుర్రం నీరజ నేతృత్వంలో పాలకవర్గం ఆ సంఘం వారికి ఒకప్పటి పంచాయతీ కార్యదర్శి చేసిన స్థలం రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేసి జిల్లా అధికారులకు పంపించారు. ఈ విషయంలో ఎవరూ జోక్యం చేసుకోకపోవడంతో ఓపెన్ జిమ్ ఏర్పాటు కలగానే మారుతుంది.



యువతకు ఉపయుక్తం– చీకట్ల కుమార్, క్రీడాకారుడు

పరికరాలు వచ్చి నెలలు గడుస్తోంది. అవి పూర్తిగా పాడవక ముందే పనులు ప్రారంభించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమస్యను త్వరితగతిన పరిష్కరించాలి. ఈ జిమ్ ఏర్పాటుతో స్థానిక క్రీడాకారులు, యువత వ్యాయామానికి ఉపయుక్తంగా ఉండనుంది.

త్వరలో పనులు ప్రారంభంశాంతికుమార్, పుర కమిషనర్ చొప్పదండి

క్రీడా మైదానంలో స్థల సమస్య త్వరలోనే పరిష్కారమవుతుంది. సంఘం నాయకులతో చర్చించాం. గుత్తేదారు వచ్చి మొత్తం చేయాల్సిన పనులు చూసుకున్నారు. కొద్దిరోజుల్లోనే పూర్తి స్థాయిలో జిమ్ పరికరాలు ఏర్పాటు చేయిస్తాం. క్రీడాకారులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

# సమీకృత మార్కెట్ సిద్ధం

వేములవాడ : వేములవాడ పట్టణ ప్రజలు, కూరగాయల రైతులకు కష్టాలు తీరనున్నాయి. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ముందు శామకుంటలో ఆధునిక హంగులతో కూరగాయల విక్రయాలకు మార్కెట్‌ను నిర్మించారు. దీంతో వేములవాడ పట్టణంలో రోడ్ల వెంబడి క్రయ, విక్రయదారుల ఇబ్బందులు తొలగనున్నాయి. శామకుంటలో రూ. 2.7 కోట్ల మున్సిపల్ నిధులతో అధునాతన వసతులతో సమీకృత (ఇంటిగ్రేటెడ్) మార్కెట్ పూర్తయింది. ఈ పనులకు రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖమంత్రి కేటీఆర్ చేతుల మీదుగా గత ఏడాది మార్చిలో శంకుస్థాపన చేశారు. యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు.

ఎమ్మెల్యే చొరవతో...పట్టణంలో ఇప్పటి వరకు సరైన కూరగాయల మార్కెట్ లేక పట్టణవాసులు, కూరగాయల వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను తొలగించేందుకు స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రత్యేక చొరవతో శామకుంట, మార్కెట్ యార్డులో రెండు మార్కెట్ల నిర్మాణానికి సంకల్పించారు. పట్టణానికి వేములవాడ పట్టణ చుట్టు పక్కల గ్రామాలతో పాటు బోయినపల్లి, కోనరావుపేట, చందుర్తి తదితర



ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకువచ్చే రైతులకు సైతం సరైన మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పట్టణంలోని తెలంగాణ కూడలి వద్ద, రెండో బైపాస్ రోడ్డులోని గంగమ్మ గుడి వద్ద కూరగాయల మార్కెట్లను రహదారుల పక్కన నిర్వహిస్తున్నారు. ఇలా కూరగాయల మార్కెట్‌కు సరైన స్థలం లేక రైతులు, విక్రయదారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. ఈ మార్కెట్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. శామకుంటలో రూపుదిద్దుకున్న సమీకృత కూరగాయల మార్కెట్‌తో రోడ్లపై క్రయ, విక్రయదారుల సమస్యలు పూర్తిగా తొలగనున్నాయి.

అన్ని సౌకర్యాలు అందులోనే..పట్టణంలోని శామకుంటలో సమీకృత కూరగాయల మార్కెట్‌ను సకల సౌకర్యాలతో అధునాతనంగా నిర్మించారు. కూరగాయలకు సంబంధించి గ్రౌండ్ ఫ్లోర్‌లో 51 స్టాల్స్, పైఅంతస్తులో 51 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో కూరగాయలతో పాటు పండ్ల విక్రయాలకు అవకాశం కల్పిస్తారు. మొదటి అంతస్తులో కూరగాయలు, పండ్లు నిల్వ చేసేందుకు కోల్డు స్టోరేజ్‌ను నిర్మించారు. రైతులు, విక్రయదారులు, వినియోగదారులకు సకల వసతులు ఉండే విధంగా తీర్చిదిద్దారు. అన్ని రకాల కూరగాయలు, పండ్లు ఇందులో లభించేలా స్టాల్స్ ఉంటాయి. దీంతో పట్టణ ప్రజలకు ఇది బాగా ఉపయోగపడనున్నది.రోడ్లపై క్రయ, విక్రయాలుండవు– అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ పట్టణంలోని శ్యామకుంటలో అన్ని హంగులతో కూరగాయల మార్కెట్ నిర్మాణం పూర్తయింది. ఈ కూరగాయల మార్కెట్ ప్రారంభంతో రోడ్లపై క్రయ, విక్రయాలు చేసే రైతులకు, వినియోగదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి.

# చివరి ఆయకట్టుకు అందని నీరు

పెద్దపల్లి : చి'వరి' ఆయకట్టు ప్రాంత రైతులకు సాగునీటి గోసలు తప్పడం లేదు. ఈ యాసంగిలో ఎక్కువ మంది రైతులు వరిసాగు వైపు మక్కువ చూపారు. జిల్లాలో డీ–83 కింద ధర్మారం, జూలపల్లి, పెద్దపల్లి సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, రామగుండం, మంథని, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, రామగిరి, ఎలిగేడు మండలాల పరిధిలో 1,25,000 ఎకరాలు, డీ–86 కింద జూలపల్లి, ధర్మారం, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల పరిధిలో 70 వేల ఎకరాలకు ఎస్సారెస్పీ నీరు సరఫరా చేస్తున్నారు. ఈ యాసంగిలో మొత్తం 2,10,678 ఎకరాల్లో సాగు చేపట్టారు. వరి సాగు విస్తీర్ణం 1,62,004 ఎకరాల అంచనా ఉండగా.. అంతకుమించి మరో 37,447 ఎకరాల్లో వరి సాగు కావడం గమనార్హం.

ప్రారంభోత్సవం ఎన్నడో?

పెద్దపల్లి జిల్లా ఆయకట్టుకు ఎస్సారెస్పీ నుంచి డీ–83, డీ–86ల ద్వారా సాగునీటి సరఫరా సరిపోవడం లేదు. చివరి ఆయకట్టుకు సాగునీటి సమస్యను దూరం చేసేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని వరద కాలువగుండా ఎస్సారెస్పీకి తరలించి ఆయకట్టు భూములకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం పునరుజ్జీవ పథకాన్ని చేపట్టింది. ఆయకట్టును స్థిరీకరించి వరద కాలువ నుంచి కాకతీయ ప్రధాన కాలువ వరకు ఓ కాలువను తవ్వి, దాని ద్వారా నీటిని తరలించాలని సంకల్పించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని లక్ష్మీపూర్ సొరంగ పంప్‌హౌస్‌ల ద్వారా వరద కాలువగుండా మధ్యమానేరుకు తరలించే పనులు ఇటీవలే పూర్తయినప్పటికీ ఇంకా ప్రారంభోత్సవం జరగకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వరద కాలువ 88వ కిలోమీటర్ వద్ద నుంచి కాకతీయ ప్రధాన కాలువ 96 కిలోమీటర్ వరకు కాలువ తవ్వి డీ–83, డీ–86 కాలువలకు కాళేశ్వరం నీళ్లను మధ్యమానేరు కంటే ముందుగానే ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం వారబందీ పద్ధతిలో 8 రోజులు ఆన్, 7 రోజు ఆఫ్ క్రమంలో 2,500 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. ఇదే కాలువ ప్రారంభోత్సవం పూర్తయితే ఏకంగా 3,500 క్యూసెక్కుల వరకు నిరంతరం నీటి తడులు అందించేందుకు అవకాశాలుంటాయి.

నీటితడులు పెంచాలి– కలవేల రాజు, రైతు, కొత్తపల్లి, పెద్దపల్లి

ఎస్సారెస్పీ డీ–86 కాలువకు అనుబంధ కాలువ కొత్తపల్లి 34–ఎల్ కింద 5 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. వారబందీ పద్ధతిన సాగునీరు ఇస్తుండటం, గతితప్పిన నీటితడుల కారణంగా వరి ఎండిపోతుంది. చుట్టుపక్కల 100 ఎకరాల మేర ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. నీటితడుల సంఖ్య పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. 34ఎల్ వద్ద సరిపోవు పైప్‌లైన్ల అనుసంధానం చేస్తేనే ఈసారి వరి పైరు దక్కుతుంది.

ప్రతీ సీజన్‌లో ఇదే తంతు– నల్లకేశవ్‌రెడ్డి, రైతు, ఇదిలాపూర్, కాల్వశ్రీరాంపూర్కాల్వశ్రీరాంపూర్ మండలానికి చివరి గ్రామం కావడం, అటు ముత్తారం మండలం ఎగువ ప్రాంతం కావడంతో ఇక్కడ సాగునీరు రావడం లేదు. మొత్తం 3 ఎకరాల్లో వరి వేశాం. 2 ఎకరాల మేర ఎండిపోయింది. నీటితడుల కొరత ఉంటే ఇంకో ఎకరం కూడా ఎండిపోతుంది. గతంలో పాలకులు చివరి ఆయకట్టు వరకు నీళ్లిస్తామని ఎన్నో సార్లు హామీలు ఇచ్చినా.. ప్రతీసారి ఇదే తంతు కొనసాగుతుంది.

వారబందీ పద్ధతిలో..– ప్రసాద్, జలవనరులశాఖ, ఈఈ, సుల్తానాబాద్

వారబందీ పద్ధతిలో డీ–83, డీ–86 కాలువల పరిధిలో 1,95,000 ఎకరాలకు 2,500 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నాం. 90 శాతం వరి పంటే సాగు చేయడం వల్ల నీటి లభ్యత ఎక్కువగా ఉంది. ఎస్సారెస్పీ నీటి సరఫరాకు అక్కడక్కడ రైతులు కొందరు తూములు మూసివేయకుండా ఎత్తివేయడంతో నీటి సరఫరా ఆగిపోతుంది. దీంతో కింద ఉన్న పంటలకు నీళ్లు రావడం లేదు.

## ఆరోగ్య మహిళకు ప్రాధాన్యం

కరీంనగర్ : పట్టణ, గ్రామీణ ప్రాంత నిరుపేద మహిళలకు అవసరమైన వైద్యం అందుబాటులో తెచ్చేందుకు వీలుగా ప్రవేశపెట్టిన 'ఆరోగ్య మహిళ' కార్యక్రమ సేవలను ప్రభుత్వం మరింత విస్తరిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు మూడు ఆరోగ్య కేంద్రాలకు పరిమితమైన ఈ సేవలు కొత్తగా మరో ఆరు చోట్ల అందుబాటులోకి తెస్తున్నారు. జిల్లాలో వీటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేపట్టారు.

ఈ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

థైరాయిడ్, గర్భాశయం, రొమ్ము క్యాన్సర్‌తో బాధపడే వారికి ప్రాథమిక పరీక్షలు జరిపి నిర్ధారించడం, మెనోపాజ్, మూత్ర సంబంధిత వ్యాధులు, ఊబకాయం, కడుపులో నీటి బుడగలు, ఫంగస్ ఇన్‌ఫెక్షన్ వంటి అంశాలపై ఆసుపత్రులకు వచ్చే యువతులు, అతివలను పరీక్షించి తగిన వైద్యం అందిస్తున్నారు. మొదట్లో ఈ కేంద్రాలకు వెళ్లేందుకు స్వశక్తి మహిళా సంఘాలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా పట్టణ, గ్రామీణ మహిళలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం జిల్లాలో మూడు ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

ఆరు నెలల కిందట..

మహిళా వైద్యులు అందించే బస్తీ దవాఖానాలు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం పలు వ్యాధులపై పరీక్షలు జరిపి వ్యాధులను నిర్ధారించి తగిన వైద్యం అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 8న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు నగరంలోని బుట్టిరాజారాంకాలనీలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు ఆసుపత్రుల్లో సేవలు అందుతున్నాయి.

జిల్లా దవాఖానాలో చికిత్సమూడు ఆసుపత్రుల్లో సుమారు 9 వేల మంది ఆయా వ్యాధుల గురించి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు టీ-హబ్ కరీంనగర్ డయాగ్నోస్టిక్ కేంద్రంలో చేయించారు. ఇందులో కొందరికి పలు




వ్యాధులకు జిల్లా దవాఖానాలో చికిత్స అందిస్తుండగా, మిగిలిన వారికి స్థానిక కేంద్రాల్లోనే వైద్యం అందించారు.

క్యాన్సర్ బాధితులకూ...

ఈ కార్యక్రమంలో క్యాన్సర్ బాధితులను గుర్తించే అంశాన్ని ప్రధానంగా చేపట్టారు. వారికి హైదరాబాద్‌లోని ఎం.ఎన్.జె, కిమ్స్, కరీంనగర్‌లోని ఓమెగా సుశ్రుత ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారు. క్యాన్సర్ నిర్ధారణకు 40 మందికి మామోగ్రఫీ, 51 మందికి పాప్స్మియర్, 17 మందికి బయాప్సీ నిర్ధారణ పరీక్షలు జరిపారు.

ఎక్కడెక్కడంటే..

కరీంనగర్‌లోని బుట్టిరాజారాంకాలనీ, చల్లూర్, చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మార్చి 8న ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రారంభించారు. కొత్తగా రేకుర్తి, తీగలగుట్టపల్లి, బస్తీ దవాఖానాల్లో, చామన్‌పల్లి, గుండి, సైదాపూర్, ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నేటి నుంచి అందుబాటులోకి తెస్తున్నారు. ఈ ఆసుపత్రుల్లో మహిళా వైద్యులు అందుబాటులో ఉంటారు.

నేడు ప్రారంభం

కొత్తగా ఆరోగ్య మహిళా కేంద్రాలను ఏర్పాటు చేయడం జిల్లావాసులకు మేలు చేకూరుస్తుంది. నేడు మంత్రి గంగుల కమలాకర్‌తోపాటు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు వాటిని ప్రారంభిస్తారు. డాక్టర్ లలితాదేవి, డీఎంహెచ్‌వో, కరీంనగర్

## ఖాళీ జాగా.. వేసేయ్ పాగా

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమణకు, కబ్జాలు గురవుతున్నాయి. రూ.కోట్లు విలువ చేసే స్థలాలకు కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో కబ్జాదారులు ఆక్రమించే ప్రయత్నాలు మొదలుపెడుతున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు వేసేయ్ పాగా అన్నట్లుగా తయారవుతున్నారు. నగరంలోని సిరిసిల్ల బైపాసు రోడ్డులో ఉన్న నీటి శుద్ధి కేంద్రానికి ఎకరాల కొలదీ స్థలముంది. అందులో నగర పాలకకు చెందిన నీటి శుద్ధి కేంద్రం, దాని పక్కనే మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రం, పంపుహౌస్‌లు, ట్యాంకులు ఉన్నాయి. ప్రజారోగ్య డివిజన్ కార్యాలయం కూడా అదే ప్రాంగణంలో ఉంది. ఇక్కడి నుంచే రోజూ తాగునీరు సరఫరా అవుతోంది. అలాంటి స్థలం లోపలకు ఎవరూ రాకుండా ఉండేందుకు చుట్టూ ప్రహరీ నిర్మించే పనులను ఆరు నెలల కిందట మొదలుపెట్టారు. ముందు భాగంలో పనులు పూర్తి చేసి.. వెనుక నిర్మించేందుకు చర్యలు చేపట్టడంతో అసలు విషయం బయట పడింది. కొంతమేర కబ్జాకు గురి కావడంతో గతంలో గుత్తేదారు, నీటిశుద్ధి కేంద్రం అధికారులు



కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణ జరగకుండా కూడా తీశారు.

హద్దులు నిర్ణయించడంలో నిర్లక్ష్యం

నీటిశుద్ధి కేంద్రం వెనుక భాగంలో సుమారు 30 గుంటల స్థలం ఆక్రమణకు గురవుతున్నట్లు తెలుస్తోంది. రాత్రికి రాత్రే నిర్మాణాలు వెలుస్తున్నా.. కనీసం ఆ వైపు కన్నెత్తి చూడటంలేదని విమర్శలున్నాయి. గతంలోనే కబ్జా విషయం గుర్తించగా ఇప్పటివరకు ఎలాంటి హద్దులు నిర్ణయించడం లేదు. ఫిల్టర్‌బెడ్ స్థలం ఎంతమేర ఉంది? ప్రైవేటు స్థలముందా? ఉంటే ఎక్కడి వరకు ఉందనే విషయాన్ని తేల్చాల్సిన పట్టణ ప్రణాళిక అధికారులు సైతం పట్టనట్లుగా ఉన్నారు. తహసీల్దార్, సర్వేయర్లతో సంయుక్తంగా కొలతలు తీసుకుంటే వాస్తవాలు బయటకు వస్తాయి.

కలెక్టర్, కమిషనర్‌కు ఫిర్యాదు

ఫిల్టర్‌బెడ్ వెనుక భాగంలో ప్రభుత్వ స్థలముండగా కొందరు ఆక్రమించుకుంటున్నారని, అక్కడ నిర్మాణాలు కూడా ఉన్నాయని ప్రజాప్రయోజనాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మహ్మద్ అమీర్ సోమవారం కలెక్టర్, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించి హద్దులు గుర్తించి బోర్డు ఏర్పాటు చేయాలని, ఆ స్థలాన్ని కాపాడాలని కోరారు.

# మరింత పారదర్శకంగా రేషన్ కార్డుల వివరాలు



జనగామ : రేషన్‌కార్డుల వివరాలు మరింత పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుంది. రేషన్‌కార్డులకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో వాస్తవ సభ్యుల వివరాలను అంతర్జాలంలో నిక్షిప్తం చేయనున్నారు. దీంతో ప్రతి కార్డుకు సంబంధించిన కుటుంబ సభ్యులందరూ ఒకసారి రేషన్ దుకాణానికి వచ్చి వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ..ఇప్పటి వరకు రేషన్‌కార్డు కలిగిన కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు రేషన్ దుకాణానికి వచ్చి వేలిముద్ర వేసి బియ్యం తీసుకునేవారు. కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా వీరికి తగ్గింపు ధరలకు బియ్యం ఇచ్చేవారు. పలు కుటుంబాల్లో చనిపోయిన వారి వివరాలు నమోదయ్యేవి కావు. వీరి పేరిట కూడా బియ్యం పంపిణీ చేసే వారు. సాధారణంగా కుటుంబసభ్యుల సంఖ్య తగ్గితే వెంటనే అధికారులకు సమాచారమిచ్చి వారి పేర్లను తొలగించాలి. కానీ ఈ ప్రక్రియ జరగడం లేదు.

అందుబాటులో లేని వారి సంగతి ?

ప్రభుత్వ ఆదేశాలతో.. దూర ప్రాంతాల్లో తమ కుటుంబ సభ్యులు ఉన్న రేషన్‌కార్డుదారులు ఆందోళన పడుతున్నారు. వేలిముద్రల కోసం వారిని రప్పించడం అనుకున్నంత సులభం కాదని అంటున్నారు. ప్రభుత్వం ఇలాంటి విషయాలపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 11వ తేదీ నుంచే ఈ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. కొన్ని సాంకేతిక కారణాలతో నిలిచిపోయిందని, ఒకటి రెండు రోజుల్లో ప్రారంభమవుతుందని సమాచారం.

ప్రభుత్వ ఆలోచన ఇలా..రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబంలో ఎవరెవరున్నారనే విషయం తెలుసుకునేందుకు.. ఒకసారి కుటుంబ సభ్యులు రేషన్ దుకాణానికి వచ్చి నో యువర్ కస్టమర్ పేరిట వేలి ముద్రలు వేయాల్సి ఉంటుంది. దీంతో ప్రతి కార్డుకు సంబంధించిన మృతుల వివరాలు తొలగిపోతాయి. బియ్యం, సరకుల కోటా కూడా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# డెంగీ.. పంజా!



జనగామ :"ములుగు ఏజెన్సీలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కేసులు ఎక్కువగా ఉన్నాయి. మహబూబాబాద్, హనుమకొండ, భూపాలపల్లి తదితర జిల్లాల నుంచి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి రోగులు వరుస కడుతున్నారు." ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాలానుగుణ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ జ్వరాలు అధికమవుతున్నాయి. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో డెంగీతో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.

ఎలా అంటే..వర్షాకాలంలో నీటినిల్వలు ఎక్కువగా ఉండటం, పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుంది. దోమలు కుట్టకుండా జాగ్రత్త పడకపోవడంతో జ్వరాలు పెరుగుతున్నాయి. ఈజిప్టి దోమ(టైగర్‌దోమ)లు కుట్టడంతో డెంగీ వ్యాప్తి చెందుతోంది. ఇది కుట్టిన 4-6 రోజుల తర్వాత జ్వరం మొదలవుతుంది. ఆకస్మికంగా అధిక జ్వరం, తీవ్రమైన తల, కళ్ల వెనుకనొప్పి, తీవ్రమైన కండరాల నొప్పి, అలసట, వికారం, వాంతులు, ఆకలి మందగించడం, అతిసారం, చర్మంపై దద్దుర్లు (జ్వరం మొదలైన రెండురోజుల నుంచి ఐదురోజుల మధ్య కనిపిస్తాయి), తేలికపాటి రక్తస్రావం(ముక్కు, చిగుళ్లలో), ప్లేట్లెట్ కౌంట్ చాలా తక్కువ స్థాయికి పడిపోతుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల చుట్టుపక్కల ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. కాలువలలో మురుగు పారే విధంగా చర్యలు తీసుకోవాలి. నిల్వ ఉన్న నీటిలో కిరోసిన్, వాడిన ఇంజిన్ ఆయిల్ చల్లాలి. నల్లా గుంతల్లో నీటిని రోజూ తొలగించాలి. ఇళ్ల పరిసరాల్లో పనికిరాని పాత కూలర్లు, టైర్లు, డ్రమ్ములు, రోళ్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండలు, స్మీసాలు లేకుండా చూసుకోవాలి. ఓవర్ హెడ్ ట్యాంకులపై మూతలు ఉంచాలి. దోమలు రాకుండా కిటికీలు, బయట తలుపులకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి. శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించాలి. నిద్రించేటప్పుడు దోమ తెరలు ఉపయోగించాలి. జ్వరాలు విజృంభిస్తున్న దృష్ట్యా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా అధికారులు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పరీక్షలు, నిర్ధారణ: జ్వరం వచ్చిన వారు సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి. రక్త నమూనాలు పరీక్షించి(ఎలీసా) వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స అందిస్తారు. డెంగీ నిర్ధారణ పరీక్ష(ఎలిసా) ఎంజీఎం ఆసుపత్రిలో మాత్రమే అందుబాటులో ఉంది. చికిత్స ఆలస్యం చేస్తే ప్రాణాంతకంగా మారవచ్చు. పోషకాహారం తీసుకున్నట్లయితే ఆరోగ్యం మెరుగవుతుంది.

రక్త పరీక్షలకు నిరీక్షణ

ములుగు జిల్లా వెంకటాపురం సామాజిక ఆరోగ్య కేంద్రం జ్వర బాధితులతో కిటకిటలాడింది. ఆసుపత్రిలో స్థలం లేక రోగులు నేలపైనే కూర్చున్నారు. కొందరు చెట్ల కింద సేదదీరారు. సోమవారం ఒక్క రోజే 120 మంది జ్వర బాధితుల రక్త నమూనాలను సేకరించినట్లు ఎల్‌టీ సాంబయ్య తెలిపారు. వెంకటాపురం

విష జ్వరంతో మహిళ మృతి

విష జ్వరం ఓ మహిళ ప్రాణాలు బలి తీసుకుంది. ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన కంచనగిరి దివ్య(26) మూడు రోజులుగా మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో చెందారు. మృతురాలికి భర్త సందీప్, రెండేళ్ల పాప ఉన్నారు. ఏటూరునాగారం

పడకలు పెంచడానికి చర్యలు

డాక్టర్ ప్రతాప్, పిల్లల విభాగాధిపతి, ఎంజీఎం ఆసుపత్రి

ఎంజీఎం ఆసుపత్రికి డెంగీ వ్యాధిగ్రస్థులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. మరో 60 పడకలు పెంచడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. మందులు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. అవసరమైతే ఎంజీఎంకు తీసుకొస్తే చికిత్స అందిస్తాం.

సత్వర చికిత్సకు ఏర్పాట్లు

డాక్టర్ చంద్రశేఖర్, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంటు

జ్వర బాధితుల కోసం 300 పడకలను సిద్ధం చేశాం. వెంటిలేటర్లు, ఆక్సిజన్ సరిపడా ఉంది. ఎంజీఎంలో సత్వర చికిత్స అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశాం.

# విద్యార్థులకు సాగుబడి పాఠాలు

జనగామ : సాగుబడి పాఠాలు తరగతి గదిలోనే నేర్చుకోవడమే కాదు.. క్షేత్రస్థాయిలో వాస్తవాలు ఏమిటో తెలుసుకునే అవకాశం వ్యవసాయం డిగ్రీ విద్యార్థులకు 'గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం (రావెప్)' ద్వారా కలుగుతోంది. వరంగల్‌లోని వ్యవసాయ కళాశాలకు చెందిన బీఎస్సీ చివరి సంవత్సర విద్యార్థినులు జిల్లాలోని కేసముద్రం మండలం తాళ్లపూస పల్లి గ్రామంలో నాలుగు నెలల క్షేత్రస్థాయి అధ్యయనం కోసం వచ్చారు. ఈ సంవత్సరం డిసెంబర్ వరకు ఉంటారు. ఉదయాన్నే అన్నదాతలతో పాటు పొలాల బాట పడుతున్నారు. సాయంత్రం వరకు పంట పొలాల్లో, చేలల్లో పనిచేస్తూ.. రైతులు చేస్తున్న పనులను పరిశీలిస్తూ.. తెలుసుకుంటు న్నారు. తరగతి గదుల్లో అధ్యాపకులు, వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకున్న పాఠ్యాంశాలు, వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులు పాటించేలా సూచనలు చేస్తున్నారు. జిల్లాలోని మల్యాల కేవీకే, ఉద్యాన పరిశోధనా స్థానాలను సందర్శిస్తూ శాస్త్రవేత్తలు చేపడుతున్న రైతుల విస్తరణ కార్యక్రమాలు, వివిధ పంటల పరిశోధనల గురించి తెలుసుకుంటున్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నారు. పెట్టుబడుల వ్యయాన్ని తగ్గించుకుని అధిక దిగుబడులను పెంపొందించుకునే దిశగా అవగాహన కలిగిస్తున్నారు.

రావెప్ కార్యక్రమం ఎందుకంటే..ప్రయోగపూర్వక, ప్రత్యక్ష అనుభవం ద్వారా వ్యవసాయ విద్యలో నాణ్యతను పెంపొందించే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ డిగ్రీ విద్యార్థుల కోసం ప్రవేశ పెట్టారు. వ్యవసాయ పనులను తామే చేయడం ద్వారా ప్రయోగపూర్వక శిక్షణ, నైపుణ్యాల పెంపుదలకు అవకాశం ఉంటుంది. విద్యార్థులు గ్రామీణ జీవితాన్ని అర్థం చేసుకోవచ్చు. రైతులు అనుసరిస్తున్న సాంకేతిక అంశాల్లో అవగాహన పెరుగుతుంది.

వ్యవసాయ విస్తరణ సేవలపై ఆసక్తి

రైతులతో కలిసి పని చేయడం.. వారి నుంచి మేం నేర్చుకోవడం.. వారికి మేం సలహాలు ఇవ్వడం ఎంతో ఉత్సాహంగా ఉంది. వ్యవసాయ విస్తరణ సేవలపై నాకు ఆసక్తి ఉంది. వ్యవసాయ పాత్రికేయం



చేయాలని ఉంది. రైతులకు పలు వ్యవసాయ విషయాలు ప్రయోగాత్మకంగా చూపడం వల్ల వారు సులువుగా అర్థం చేసుకుంటారు. ఏ సమయంలో ఎక్కడ పెట్టుబడి పెట్టాలనే విషయంలో చైతన్యపరచాల్సి ఉంది. నూతన పరిజ్ఞానాన్ని తెలియజేస్తున్నాను..

కె.అనూష, తల్లాడమాది వ్యవసాయ కుటుంబం. నాన్న కష్టాన్ని స్వయంగా చూశా. ఇప్పుడు ఈ వ్యవసాయ క్షేత్రాల్లోనూ పరిశీలిస్తున్నా. రైతులకు నూతన వ్యవసాయ పరిజ్ఞానం, పద్ధతులను తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఆ విషయాలు తెలియజేస్తున్నాం. రైతులు రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతున్నారు. దాని వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తున్నాం.

మట్టి పరీక్షల ప్రాధాన్యంపై అవగాహన

ఎం.మానస, వరంగల్

వ్యవసాయ శాస్త్రవేత్త కావాలని ఉంది. వివిధ పంటల సాగులో రైతులు అనుసరిస్తున్న పద్ధతులను గమనిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఎన్నో విషయాలు తెలుస్తున్నాయి. రైతులను పలు అంశాల్లో చైతన్యపరచాల్సిన అవసరం ఉంది. మట్టి పరీక్షల ప్రాధాన్యాన్ని వివరిస్తున్నాం. సేంద్రియ విధానాలపై చైతన్యం

ఎం.దుర్గాదేవి, పాల్వంచతరగతి గదిలో చదివిన విషయాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్నాం. సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై వివరిస్తున్నాం. రసాయనిక ఎరువులను, క్రిమిసంహారక మందులను తగ్గించాలని చెబుతున్నాం. బ్యాంకుల్లో వ్యవసాయ సంబంధిత విభాగ ఉద్యోగం చేయాలని ఉంది.

# బ్యాంకర్ల కొర్రీలు.. ఆధార్ కష్టాలు

పెద్దపల్లి : కరీంనగర్ జిల్లా వీణవంక మండలానికి చెందిన రైతు రమేశ్ 2018లో రూ.80 వేల పంట రుణం తీసుకున్నారు. నాలుగేళ్లుగా మాఫీ లేకపోవడంతో వడ్డీ చెల్లిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన ఖాతాలో రూ.1,05,000 మేర రుణం కనిపిస్తోంది. ఇటీవల రమేశ్ చరవాణికి రుణ మాఫీ పథకం కింద రూ.80 వేలు మాఫీ అయినట్లు సందేశం వచ్చింది. ఇదేమిటని బ్యాంకుకు వెళ్లి అడిగితే మాఫీ సొమ్ము పోగా మిగిలిన రూ.25 వేలు కట్టాల్సిందేనని చెప్పారు. గత ఎన్నికల సమయంలో అధికార భారాస ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రూ.లక్ష వరకు ఉన్న పంట రుణాన్ని ఇటీవల మాఫీ చేసింది. ఈ మేరకు మాఫీ అయిన మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అయితే బ్యాంకర్ల కొర్రీలు, ఇతర కారణాలతో మాఫీ ప్రక్రియ సాఫీగా జరగడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన 2018 డిసెంబరు 11వరకు పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ మాఫీ వర్తించనుంది. గతంలో పంట రుణం తీసుకున్న కొందరు రైతులు మృతి చెందారు. మరికొందరి ఖాతాలు మనుగడలో లేకపోవడంతో ఇన్‌యాక్టివ్ ఖాతాగా చూపిస్తున్నారు. కొందరు రైతులు రుణ మాఫీ వర్తించడం లేదని, వడ్డీ భారం పెరుగుతుందనే భయంతో సొంతంగా చెల్లించారు. ఇలాంటి వారి వివరాలను ఇప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు పెండింగ్‌లోనే పెట్టారు. నవీకరించిన ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం నకలు పత్రాలను సమర్పిస్తేనే మాఫీ వర్తింపజేస్తామని బ్యాంకర్లు స్పష్టం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2,96,073 మంది రైతులు రుణ మాఫీకి అర్హులు కాగా రూ.1,594 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుంది.

ఆధార్ నవీకరణ కష్టాలు

గతంలో బ్యాంకర్లు చేసిన తప్పిదాలతో ప్రస్తుతం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకే ఆధార్ నంబరుతో గరిష్ఠంగా ముగ్గురు రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను అనుసంధానించారు. అలాంటి వారి బ్యాంకు ఖాతాలకు మాఫీ సొమ్ము జమ కావడం లేదు.

ఉమ్మడి జిల్లాలో దాదాపు 15 వేల మందికి ఆధార్ అనుసంధానం, నవీకరణ సమస్యలు వచ్చాయి. బంగారం తాకట్టు పెట్టి పంట రుణాలు తీసుకున్న వారిలో ప్రస్తుతానికి గ్రామీణ ప్రాంతాల వారికే మాఫీ వర్తింపజేస్తున్నారు. అర్బన్ బ్యాంకుల్లో బంగారం రుణాలు తీసుకున్న వారు వ్యవసాయ అవసరాలకే తీసుకున్నారా? ఇతర అవసరాలకా? అన్నది బ్యాంకర్లు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

ఉమ్మడి కుటుంబాలకు చిక్కులు

ఒకే కుటుంబంలోని వారు వివాహమై వేరుపడి భూములపై పట్టా హక్కులు పొంది సొంతంగా పంట రుణాలు తీసుకున్నారు. అయితే ఇప్పుడు విడిపోయిన వారందరినీ ఒకే కుటుంబంగా గుర్తించడంతో ఉమ్మడి జిల్లాలో దాదాపు 10 శాతం కుటుంబాలకు మాఫీ వర్తింపు నిలిచిపోయింది. వ్యవసాయ శాఖ జిల్లాలోని రైతులను కుటుంబాల వారీగా మ్యాపింగ్ చేయకపోవడంతో మాఫీ సొమ్ముకు నోచుకోవడం లేదు. .కుటుంబంలో భార్యాభర్తల పేరున భూములుండి వేర్వేరుగా పట్టాదారు పాసుపుస్తకాలు కలిగి ఉన్నా సమస్యలు వస్తున్నాయి. ఇద్దరి బ్యాంకుల్లో రూ.లక్ష వరకు పంట రుణం తీసుకుంటే ఇద్దరికీ మాఫీ నిలిచిపో యింది.

రైతుబంధు పోర్టల్ ఆధారంగా జమ

ఆధార్ వివరాలను ఒకరి కంటే ఎక్కువ మంది ఖాతాలతో అనుసంధానించడంతో సమస్యలు వస్తున్నాయి. ఆ వివరాలను మరోసారి పరిశీలించి తిరిగి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి వారికి రైతుబంధు పోర్టల్‌లోని పొదుపు ఖాతాలకు మాఫీ నిధులు జమ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆదిరెడ్డి, పెద్దపల్లి, జిల్లా వ్యవసాయశాఖాధికారి

## ఖని ఆసుపత్రిలో 29 మంది సీనియర్ రెసిడెంట్లు

గోదావరిఖని : రామగుండం, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్‌లోని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో మొత్తం 132 మంది సీనియర్ రెసిడెంట్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. రామగుండం ఆసుపత్రికి 35 మందిని కేటాయించగా 29 మంది విధుల్లో చేరారు. ప్రత్యేక వైద్య విభాగంలో పీజీ పూర్తి చేసిన వైద్యులు తప్పనిసరిగా ఏడాది పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందించాలి. దీనిలో భాగంగా బోధనాసుపత్రుల్లో వారికి విధులు కేటాయించగా కౌన్సిలింగ్‌లో వారికి అనుకూలంగాఉన్న ఆసుపత్రులను ఎంచుకొని ఈ నెల 5వ తేదీలోగా విధుల్లో చేరాల్సి ఉంది. ఒప్పంద విధానంలో వైద్య కళాశాలల్లో నాన్ క్లినికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇద్దరు మాత్రమే చేరగా ఇప్పటికే ఇక్కడ పనిచేస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్లుగా విధుల్లో చేరారు.

ప్రైవేటు వైద్య కళాశాలల తిరకాసు

రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుతో పాటు అత్యధిక సంఖ్యలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంతో ప్రైవేటు వైద్య కళాశాలలకు ఆచార్యుల కొరత ఏర్పడుతోంది. దీంతో ఆయా ప్రైవేటు వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న సహాయ ఆచార్యులను రిలీవ్ చేయకుండా వేతనాలు పెంచుతూ అక్కడే ఉంచుకునేందుకు తీవ్రస్థాయిలో కొందరు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో అత్యంత కీలకమైన విభాగాల్లోని సహాయ ఆచార్యులు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చేరడం లేదు. గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఓ కీలకమైన విభాగంలో సహాయ ఆచార్యులుగా నియమితులైన ఇద్దరు సహాయ ఆచార్యులు గత కొంతకాలంగా ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో పనిచేస్తున్నారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు ఇప్పుడు వారిని రిలీవ్ చేయకుండా ఒక్కసారిగా వారి వేతనాలను పెంచుతూ అక్కడే ఉంచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయా విభాగాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సహాయ ఆచార్యుల కొరత ఏర్పడనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

100కు చేరుకున్న ఆచార్యులుగోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాల, సార్వజనిక ఆసుపత్రిలో చేరిన ఆచార్యులు, సీనియర్ రెసిడెంట్లతో కలిపి సుమారుగా 100 వరకు ఉన్నారు. సహాయ ఆచార్యుల పర్యవేక్షణలో సీనియర్ రెసిడెంట్లు ఏడాదికాలం పాటు సేవలందించాల్సి ఉంది. ఇంతకు ముందు వరకు గోదావరిఖనిలోని వైద్య కళాశాలలో పలువురు ఆచార్యులు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సేవలందిస్తున్నారు. మూడు నెలల క్రితం 41 మంది వివిధ విభాగాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు నియమితులయ్యారు. తాజాగా ఒప్పంద విధానంలో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. వీరికి తోడుగా 29 మంది సీనియర్ రెసిడెంట్లు ఏడాదికాలం పాటు సేవలందించేందుకు విధుల్లో చేరారు. వీరు వైద్య కళాశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు ఆసుపత్రిలో ప్రజలకు వైద్య సేవలందించనున్నారు. ఒప్పంద విధానంలో నియమితులైన సహాయ ఆచార్యుల్లో ఫోరెన్సిక్, అనాటమీ విభాగానికి చెందినవారున్నారు. గోదావరిఖని ఆసుపత్రిలో ఫోరెన్సిక్ విభాగం ఏర్పాటు కావడం ఇదే మొదటి సారి.

## వాగులనూ వదలని కబ్జాదారులు

మహబూబాబాద్ : ఇది బయ్యారం మండలం నోక్లాతండా సమీపంలోని పట్టివాగు. విశాలమైన విస్తీర్ణంతో ఉండే ఈ వాగు పరివాహక ప్రాంతాన్ని సమీపంలోని కొంత మంది రైతులు సాగుభూముల్లో కలుపుకుంటున్నారు. దీంతో ఈ వాగు విస్తీర్ణం తగ్గుతోంది. ఈ వాగులోని నీటిని 150 ఎకరాలకు సాగునీరుగా అందించేందుకు ఎత్తిపోతల పథకం నిర్మించారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేయకుంటే సాగునీటి పథకం నీరుగారిపోయే ప్రమాదం ఉందని.. అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారుచెరువుల ఎఫ్‌టీఎల్, శిఖం భూములనే కాదు.. వాగుల పరివాహక ప్రాంతాలను సైతం ఆక్రమించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరా చేసుకుంటున్న అక్రమార్కులు క్రమంగా మట్టిపోసి చదును చేస్తున్నారు. ఆక్రమిత భూముల్లో పంటలను వేస్తున్నారు. నిర్మాణాలు చేపడుతున్నారు. ఫలితంగా వర్షాలు కురిసినప్పుడు వచ్చే వరద నీరంతా ఉప్పొంగి సమీపంలోని రైతుల పొలాలు మునగడంతోపాటు కోతకు గురవుతున్నాయి. నీటి నిల్వ కోసం నిర్మించిన చెక్‌డ్యాంలు సైతం దెబ్బతింటున్నాయి.

పట్టించుకోని అధికారులు

నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెం ఊరచెరువుల్లోకి వర్షాకాలంలో పంటపొలాల పైపాటు నుంచి వచ్చేందుకు వరద కాలువ ఏర్పాటు చేశారు. సుమారు 300 మీటర్ల పొడవు కాలువను ఒక ప్రభుత్వ ఉద్యోగి, ప్రజాప్రతినిధి కలిసి అందులో మట్టిపోసి పూడ్చి చదును చేశారు. అంతలోతే ఆక్రమించడం అందులో పంటలను సాగు చేసుకుంటున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని గొలుసు కట్టు విధానంలో ఉన్న పంట కాలువను కొందరు స్థిరాస్తి వ్యాపారులు పూడ్చి వెంచర్లలో కలుపుకున్నారు. జులైలో కురిసిన భారీ వర్షాలకు వాగులు వరదలతో ఉగ్రరూపం దాల్చడంతో ఇరువైపులా కట్టలు కోతకు గురయ్యాయి. దీంతో నీటి నిల్వకు గండిపడింది. పరివాహక ప్రాంత భూములు ఆక్రమణలకు గురయినందునే ఈ ఘటనలు జరిగినట్లు ఒక ఇంజినీరింగ్ అధికారి తెలిపారు. వాగుల పరివాహక ప్రాంతాలు, వరద నీటి కాలువలు ఆక్రమణల పాలవుతున్నప్పటికీ ఇంజినీరింగ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మట్టిపోసి చదును చేసినట్లు కనిపిస్తున్నది నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపల్లి పెద్ద చెరువులోకి వచ్చే వరద కాలువ ఇది. ఈ కాలువ గ్రామ శివారులో ఉంది. పొలాల నుంచి వర్షపు నీరు కాలువ ద్వారా చెరువులోకి చేరేలా నిర్మించారు. ఇటీవల ఒకరు ఆ ప్రాంతంలో స్థిరాస్తి వెంచర్ ఏర్పాటు చేసే క్రమంలో ఆక్రమించుకున్నారు. సుమారు 15 అడుగుల వెడల్పుతో కలిగిన 150 మీటర్ల పొడవున్న కాలువను మట్టిపోసి చదును చేశారు. ఇకపై వర్షాకాలంలో వరద నీరు చెరువులోకి రావడం కష్టమే. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సమీప రైతులు చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

కిషన్ నాయక్, ఏఈ, నెల్లికుదురు

వరద కాలువ ఆక్రమణలకు గురైనట్లు సమస్య మా దృష్టికి వచ్చింది. పని భారంతో దానిపై దృష్టి సారించలేదు. త్వరలోనే క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలన చేస్తాం. అక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

## పంట నష్ట పరిహారం అందేనా?

జనగామ : జిల్లాలో యాసంగి సీజన్‌లో కురిసిన వడగళ్ల వర్షాలు, ఈదురు గాలులతో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. చేతికందే దశలో వరి, మొక్కజొన్న, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందజేయాలంటూ రైతులు, వివిధ పార్టీల నాయకులు ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. దీనికి స్పందించిన ప్రభుత్వం దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం అందిస్తామని హామీ ఇచ్చింది. ఇందుకు అనుగుణంగానే అధికారులు గ్రామాల్లో తిరిగి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. బాధిత రైతుల వివరాలను సేకరించారు. ఐదు నెలలవుతున్నా నేటికీ రైతులకు పరిహారం అందలేదు. యాసంగి పెట్టుబడులు చేతికి రాక పోగా, వానాకాలం సాగు పెట్టుబడులకు డబ్బులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

వరి, మామిడికి తీవ్ర నష్టం

జిల్లాలో 20,160 మంది రైతులకు చెందిన 36,697 ఎకరాల్లోని వరి, మామిడి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సర్వేలో గుర్తించారు. క్లస్టర్లు, గ్రామాల వారీగా ఏఈవోలు దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించారు. వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో మొదటి విడతలో నిధులు మంజూరయ్యాయి. రెండో విడతలో జనగామ జిల్లాకు మంజూరు చేయాల్సి ఉంది. రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని రెండు నెలల క్రితమే అధికారులు చెప్పినప్పటికీ నేటికీ అమలు కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రైతులకు రుణమాఫీ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించడంతో పంట నష్ట పరిహారం చెల్లింపు



లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. రుణమాఫీ పూర్తయిన తర్వాతే పరిహారం అందుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఐదు నెలలవుతున్నా పట్టింపేదీ?

నామాల శ్రీను, రైతు

జనగామ మండలం పెద్దపహాడ్‌కు చెందిన రైతు నామాల శ్రీను తనకున్న పదెకరాల్లో యాసంగిలో వరి పంట వేశారు. పెట్టుబడుల కోసం రూ.2.50 లక్షలు ఖర్చు చేశాడు. వారం రోజుల్లో పంట చేతికొస్తుందనగా వడగళ్ల వాన బీభత్సంతో ఒక్క ధాన్యపు గింజ కూడా చేతికి రాకుండా పోయింది. నామాల శ్రీను 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ దెబ్బతిన్న పంటల పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని, ఐదు నెలలవుతున్నా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశాడు.

నిధుల విడుదలకు ఎదురు చూస్తున్నాం

వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

జిల్లాలో వడగళ్ల వానతో పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాం. దెబ్బతిన్న పంటలు, రైతుల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించాం. పంటలకు నష్ట పరిహారం విషయంపై ప్రభుత్వం జీఓ సైతం విడుదల చేసింది. నిధుల విడుదల కోసం ఎదురు చూస్తున్నాం. నిధులు విడుదలైన వెంటనే బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయిస్తాం.

# నిధుల్లేక నీరసం



కొత్తగూడెం :అశ్వాపురం మండలం చింతిర్యాలలో పారిశుద్ధ్యం పడకేసి జ్వరాలు వ్యాపించాయి. కలుషిత నీటి కారణంగా ఎంతో మంది రోగాల బారినపడ్డారు. దగ్గు, జలుబు, తలనొప్పి, అతిసారం బాధితులు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. చంద్రుగొండ మండలంలోని మహ్మద్‌నగర్‌లో నీటి జనిత వ్యాధులతో బాధపడేవారు ఎక్కువగా ఉన్నారు. నీటిట్యాంకులో పూడిక పేరుకుని, ఫంగస్ వ్యాపించినా శుభ్రం చేసినవారు లేరు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో రోగాల వ్యాప్తి క్రమంగా తగ్గుతోంది.

వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. పలు ప్రాంతాల్లో వర్షాలతో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. మురుగు సమస్య వేధిస్తోంది. కలుషిత నీటి సరఫరాతోనూ వ్యాధులు ప్రబలుతున్నాయి. పల్లెలు, పట్టణాల్లో జల భాండాగారాలు శుభ్రం చేసే పరిస్థితుల్లేక నీటి జనిత వ్యాధులు వ్యాపిస్తున్నాయి. పారిశద్ధ్య నిర్వహణకు నిధుల లేమి సమస్య ఎదురవుతోంది. జనాభా ప్రాతిపదికన ప్రతి నెలా పంచాయతీల ఖాతాల్లో ప్రత్యేక నిధులు జమ కావాల్సి ఉంది. కొద్దినెలలుగా ఆయా నిధులు మంజూరవడం లేదు. ట్రైబ్డ్ నిధులతో శానిటేషన్, మెరుగైన తాగునీటి సదుపాయాల కల్పనకు, అన్‌ట్రైబ్డ్ నిధులను వాహనాల విడిభాగాలు డీజిల్ ఇతర నిర్వహణ అవసరాలకు వినియోగించాల్సి ఉంది. గత కొద్దినెలలుగా ఈ రెండు నిధుల్లో ఏవో ఒకటి జమ చేస్తున్న ప్రభుత్వం చేతులు దులిపేసుకుంటోంది.

బ్లీచింగ్‌లో సున్నం

కాలువల్లో పూడిక తీసిన తర్వాత, మురుగు నీటి నిల్వ ప్రాంతాల్లో దుర్వాసన రాకుండా, ఈగల సంతతి వృద్ధిచెందకుండా బ్లీచింగ్ చల్లాలి. కానీ నిధుల కొరత కారణంగా బ్లీచింగ్‌లో సున్నం కలిపి అక్కడక్కడా మొక్కుబడిగా చల్లేస్తున్నారనే విమర్శలున్నాయి. దోమల నివారణకు చేపట్టాల్సిన ఫాగింగ్ ప్రక్రియను చాలాచోట్ల అటకెక్కిస్తున్నారు. మురుగు గుంతల్లో దోమల నివారణ మందు పిచికారీ, ఆయిల్ బాల్స్ సక్రమంగా జరగడం లేదన్న విమర్శలున్నాయి.

ప్రజల సహకారంతో జ్వరాల నివారణ డా.స్పందన, మలేరియా నివారణ ప్రోగ్రాం అధికారిజ్వరాల తీవ్రతను తగ్గించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ పరంగా చర్యలు చేపడుతున్నాం. జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తున్నాం. ఇంట్లోనే ప్రమాదకరమైన దోమల వృద్ధికి కారకులమ వుతున్నాం. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి వాటి సంహారానికి చర్యలు తీసుకోవాలి. చాలాకాలం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో కూలీలు అడవి దోమలు కుట్టకుండా కాళ్లు, చేతులను పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలి. ఇళ్లల్లో దోమ తెరలను వినియోగించుకోవాలి. ఫ్రిజ్‌ల వెనుక భాగంలోని నీరు నిల్వ చేసే డబ్బాల్లోనూ డెంగీకారక దోమలు వృద్ధి చెందే ప్రమాదముంది. చాలారోజులు నిల్వ ఉన్న నీళ్లను తాగినా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇళ్ల ముందు డ్రైనేజీల్లో ప్లాస్టిక్ సీసాలు, ఖాళీ డబ్బాలు, సంచులు పోగుపడకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి.

# బోరుమంటున్న అన్నదాత



కొత్తగూడెం : వ్యయం తప్ప సాయపడనిదే వ్యవసాయం. ప్రస్తుతం సాగర్ ఆయకట్టు రైతుల పరిస్థితి ఇలానే ఉంది. విత్తు దగ్గర నుంచి పంట చేతకొచ్చే వరకు ఎన్నో వ్యయప్రయాసలు. వర్షాకాలం ముగింపు దశకు చేరినా సాగర్ జలాశయంలోకి నీరు చేరలేదు. దానికి అనుబంధంగా ఉన్న ఆయకట్టు, చెరువులు, ఇతర జలాశయాల పరిస్థితి ప్రశ్నార్థకంలో పడింది. సాగర్ జలాశయం నుంచి సాగునీరు వచ్చే పరిస్థితి కనుచూపు మేర కనిపించడం లేదు.. మాగాణి భూముల్లో వరి సాగు ప్రశ్నార్థకంగా మారగా, మెట్ట పైర్ల పరిస్థితిపై రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు బోర్లు వేయిస్తుండగా మరికొందరు బావులు తవ్విస్తున్నారు. అయినకాడికి అప్పు తీసుకొచ్చి భగీరథ ప్రయత్నం చేస్తున్నా కొందరికి నీరు పడటం లేదు. ఈ నేపథ్యంలో ఆయకట్టు రైతులు దుఃఖసాగరంలో కొట్టుమిట్టాడుతున్నారు.

3 నెలలు.. 3 వేల బోర్లు

మెట్ట పైర్లను కాపాడుకునేందుకు, మిరపను సాగుచేసేందుకు రైతులు బోర్లు, బావులు తవ్విస్తున్నారు. జిల్లాలోని 17 మండలాల్లో 2.51 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటికే 1.25 లక్షల ఎకరాల మాగాణిలో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. మిగిలిన 1.26 లక్షల ఎకరాల్లో కొందరు పెసర వేయగా మరికొందరు మిరప, మొక్కజొన్న సాగుకు సిద్ధమయ్యారు. సాగర్ నుంచి నీరు రావడం గగనంగా మారడంతో సాగునీటి కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని మండలాల్లో అధిక సంఖ్యలో బోర్లు వేస్తున్నారు. ఈ మూడు నెలల్లో జిల్లాలోని అన్ని మండలాల్లో కలిపి సుమారు 3వేల బోర్లు వేశారు. తల్లాడ మండలం మల్లవరంలో ఇటీవల సుమారు 50 బోర్లు వేశారు. ఏన్కూరు, కొణిజర్ల, బోనకల్లు, మధిర, సత్తుపల్లి, కల్లూరు, చింతకాని, వైరా మండలాల్లో విరివిగా బోర్లు, బావులు తవ్వుతున్నారు. ఖమ్మం జిల్లాలో గతేడాది 69వేల వరకు మిరప సాగుచేయగా, ఈ ఏడాది లక్ష వరకు సాగుచేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 30 వేల ఎకరాల్లో మిరపను వేయగా.. సాగర్ నీరొస్తే పూర్తిస్థాయిలో సాగు చేపట్టేవారు. మిరప నారు ముదురుతుండటంతో దానిని సాగు చేసేందుకు బోర్లు వేస్తున్నారు.

రైతులపై భారం

ఒక్కొక్క బోరుకు నీరు పడే లోతును బట్టి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు వస్తుంది. బోరుకు సంబంధించి అడుగుకు రూ.95 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తుండగా, కేసింగ్‌కు అడుగుకు రూ.350 వరకు ఖర్చు అవుతుంది. ఒక్కొక్క బోరును 250 నుంచి 300 అడుగుల వరకు వేస్తున్నారు. కొందరికి తక్కువ లోతులో నీరు పడుతుండగా మరికొందరికి 300 అడుగుల వరకు వేసిన జలం రావటం లేదు. మిరప, మొక్కజొన్న సాగు చేయాలంటే అధిక నీటి తడులు అవసరం. సాగర్ నీరు రాకుంటే మెట్ట పంటల సాగు ముందుకు సాగదు. ఈ నేపథ్యంలో ఖర్చు ఎక్కువైనా, అదనపు భారమైనా బోర్లు వేస్తున్నారు. బోర్లు ఉన్నవారి దగ్గర నుంచి నీటి కొనుగోలుకు ఒప్పందాలు చేసుకుంటున్నారు.మిరప సాగు చేసేందుకు ఆరు బోర్లు వేయగా రూ.2 లక్షల వరకు ఖర్చు వచ్చింది. చివరకు ఒక బోరులో నీరు పడింది. సాగర్ నీరు రాకపోవడంతో మిరప నారు ముదరడంతో దాని చివర్లను కూలీలతో కోయిస్తున్నాం. సాగునీటి కోసం ఈ సమయంలో అధికంగా ఖర్చు చేయాల్సింది.

# మన బడి.. మందకొడి

కొత్తగూడెం : పాఠశాల విద్యను బలోపేతం చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు, మన బడి' పథకాన్ని గతేడాది ప్రారంభించింది. ఈ సంవత్సరం చివరి నాటికి పనులు పూర్తి చేయాలని సంకల్పించింది. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి, అభ్యసనను ప్రభావితం చేసే అంశాలతో పాఠశాలలను తీర్చిదిద్దాల్సి ఉంది. కానీ ఆ దిశగా అడుగులు పడటం లేదు. మూడు నెలలుగా నిధులు విడుదల కాకపోవడంతో సంబంధిత గుత్తేదారులు పనులు చేయటానికి ముందుకురావడం లేదు. సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ఇంజినీర్లతో సమావేశమై దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. కేవలం అరకొరగా సివిల్ పనులు కొనసాగుతున్నాయి.

సివిల్ పనులకే పరిమితం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రధానంగా సివిల్ పనులు జరుగుతున్నాయి. నిరంతర నీటి సరఫరాతో మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ, తాగునీరు, ఫర్నిచర్, పెయింటింగ్, పెద్ద, చిన్నతరహా మరమ్మతులు, ఆకుపచ్చ రాత బోర్డులు, ప్రహరీ, వంట గది, శిథిల భవనాల స్థానంలో నూతన గదులు, భోజనశాల(ఉన్నత పాఠశాలలు), డిజిటల్ సౌకర్యాలు ఇలా మొత్తమ్మీద 12 రకాల పనులు చేయాల్సి ఉంది. తొలి దశ పనులే ఇప్పటివరకు సకాలంలో పూర్తి కాలేదు. రెండు, మూడో దశ పనులు ఎప్పుడు పూర్తవుతాయో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. పనులు పూర్తయిన పాఠశాలలకు రంగులు, డ్యూయల్ డెస్కులు సరఫరా కాకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

గుత్తేదారులు చేసిన పనులకు కొలతల పుస్తకం (మెజర్‌మెంట్ బుక్) ప్రకారం మంజూరైన నిధులను కలెక్టర్లు తక్షణమే విడుదల చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల మంజూరులో కొంత జాప్యం జరుగుతోంది. అయినప్పటికీ పనులు పూర్తిచేస్తే సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకుంటాం. వెంకటేశ్వరాచారి, డీఈఓ, భద్రాద్రి

# చక్కెర పానకం.. సారా ప్రవాహం!

భూపాలపల్లి : మారుమూల తండాలు.. పల్లెలు.. మొదలు కొని పట్టణ శివారు ప్రాంతాల్లోనూ గుడుంబా మళ్లీ గుప్పుమంటోంది. తక్కువ ధరకే దొరుకుతుండటంతో మందుబాబులు ఎగబడి తాగుతున్నారు. దీనికి తోడు మద్యం ధరలు పెరగడమూ ప్రధాన కారణంగా తెలుస్తోంది.. దీంతో గుడుంబాకు చాలా మంది బానిసలవుతున్నారు. అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారు.. ఆబ్కారీ శాఖ నాటుసారా తయారీపై నిఘా కఠినతరం చేసింది. స్థావరాలపై తరచూ దాడులు కొనసాగిస్తోంది. బెల్లం విక్రయాలపై ఆంక్షలు పెట్టింది. ఇంత కట్టడి చేసినా సారా తయారీ ఆగడం లేదు. తయారీదారులు వారి పంథా మార్చుకున్నారు. బెల్లం స్థానంలో చక్కెర వినియోగిస్తున్నారు. దీంతో మళ్లీ తయారీ పుంజుకుంది.

అటకెక్కిన పునరావాస పథకం

సారానే జీవనోపాధిగా ఎంచుకున్న కుటుంబాలను ఎంపిక చేసిన ప్రభుత్వం పునరావాసం కల్పించేందుకు రాయితీతో స్వయం ఉపాధి పథకాలను మంజూరు చేసింది. ఈ కార్యక్రమాలు కొద్ది రోజులు మత్తు దందాను నివారించగలిగారు. తక్కువ పెట్టుబడితో పెద్దఎత్తున డబ్బులు వస్తుండడంతో తిరిగి బట్టీలు నిర్వహిస్తున్నారు. ఉపాధి యూనిట్ల ఎంపికలో లోపాల కారణంగానూ పునరావాస పథకాలు వారి కడుపు నింపలేకపోతున్నాయనే విమర్శలున్నాయి.

ఇటీవల సంఘటనలు

ఈ నెల 9న రేగొండ మండలం రేపాక గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో నాలుగు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. బెల్లం బదులు 500 లీటర్ల చక్కెర పానకం వాడగా దానిని ఎక్సైజ్ సిబ్బంది ధ్వంసం



చేశారు.గత నెలలో చిట్యాల మండలంలోని అందుకుతండాకు చెందిన నాటు సారా విక్రయదారుడు ఆబ్కారీ శాఖ దాడుల్లో పట్టుబడ్డాడు. గతంలోనే చాలా సార్లు గుడుంబా విక్రయించవద్దని సిబ్బంది హెచ్చరించారు. అయినా మారకపోవడం, మళ్లీ అదే దందా చేయడంతో అతనిపై కేసు నమోదు చేశారు. రూ.50 వేల జరిమానా వేశారు.గత నెలలో చిట్యాల మండలంలోని పాశీగడ్డతండాకు చెందిన ఓ వ్యక్తి గుడుంబా రవాణా చేస్తూ దొరికిపోయాడు. కేసు నమోదు చేశారు. అయినా మళ్లీ అదే పనిచేస్తూ పట్టుబడ్డాడు. ఆబ్కారీ అధికారులు రూ.30 వేల జరిమానా విధించారు.

పల్లెలపై నిఘా..రాష్ట్ర ప్రభుత్వం నాటుసారాపై ఉక్కుపాదం మోపుతోంది. పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఎక్సైజ్ శాఖ దాడులను తీవ్రతరం చేసింది. మారుమూల పల్లెలు, తండాలపై నిఘా ఉంచారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీ చేస్తున్నారు. లీటర్ల కొద్ది గుడుంబా స్వాధీనం చేసుకుంటున్నారు. చక్కెర, బెల్లం పానకం ధ్వంసం చేస్తున్నారు. వాహనాలపై రవాణా చేస్తున్న నాటుసారాను మాటువేసి పట్టుకుంటున్నారు. అయినా ఎవరికీ కనిపించకుండా వ్యవసాయ భూముల్లో చాలా లోతు భూమిలో పెద్ద పెద్ద డ్రమ్ముల్లో పానకం పాతిపెడుతున్నారు. కొద్ది రోజుల తర్వాత ఆ పానకం తీసుకొచ్చి దగ్గర్లోని ప్రదేశంలో నాటుసారా తయారుచే స్తున్నారు.

పీడీ యాక్ట్ నమోదు..గుడుంబా తయారీదారులపై కఠిన చర్యలు చేపడుతున్నారు. సాటు సారా, పానకం మొదటిసారి దొరికితే కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేస్తున్నారు. వీరిపై నిఘా ఉంచుతున్నారు. రెండోసారి పట్టుబడితే కేసు నమోదు చేసి రూ.లక్ష జరిమానా విధిస్తున్నారు. లేదా రెండేళ్ల పాటు జైలు శిక్ష ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మూడోసారికైతే పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తున్నారు.

కఠిన చర్యలుంటాయి..శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

గుడుంబా తయారీ చేస్తే కఠిన చర్యలు ఉంటాయి. సమాచారం అందగానే దాడులు చేస్తున్నాం. ఎక్కడికక్కడ కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. విక్రయించిన, తయారు చేసిన బైండోవర్ చేస్తున్నాం. మళ్లీ పట్టుబడితే రూ.లక్ష జరిమానా విధిస్తున్నాం. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నాం.

## అనుమతి లేకుండానే నిర్మాణం

పరకాల : పరకాలలో రెవెన్యూ శాఖకు సంబంధించిన స్థలంలో పురపాలక శాఖ అధికారులు చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. తమ శాఖ స్థలంలో గదుల నిర్మాణాలు ఎలా చేస్తారని అభ్యంతరాలు వ్యక్తం చేసింది. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోనే మండల పరిషత్తుతో పాటు రెవెన్యూ డివిజన్ కార్యాలయ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ క్రమంలో రెవెన్యూ కార్యాలయాల సముదాయాల ముందు నిర్మించిన ప్రహరీని ఆనుకొని ప్రధాన రోడ్డుపై 15 షాపింగ్ కాంప్లెక్స్ గదుల నిర్మాణ పనులను గత నెలలో పురపాలక సంఘం అధికారులు చేపట్టారు. మున్సిపాలిటీకి అదనపు ఆదాయం వచ్చేలా చేయాలని అధికారులు, పాలకవర్గం కలిసి పట్టణ అభివృద్ధికి సీఎం కేసీఆర్ విడుదల చేసిన నిధుల్లో నుంచి రూ. కోటి నిధులను ఈ పనులకు కేటాయించారు. టెండర్ ప్రక్రియ ద్వారా పనులను మొదలెట్టారు. ప్రస్తుతం ఫిల్లర్ల దశలో ఉన్నాయి. పది రోజుల కిందట ఆ పనులపై రెవెన్యూ శాఖ నుంచి అభ్యంతరాలు వచ్చినట్లు సమాచారం. వాస్తవంగా అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలంటే రెవెన్యూ శాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతి అవసరం. ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా గదులను నిర్మిస్తుండటంతో అభ్యంతరాలు వచ్చాయి. ఆ కారణంగానే పనులను ఆపివేశారు. తమ స్థలంలో పురపాలక నుంచి కాంప్లెక్స్ కట్టడం ఏమిటని, మా శాఖ నుంచి మేమే కడితే ఆదాయం మాకు రాదా? అని రెవెన్యూ శాఖకు చెందిన ఒకరిద్దరు అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు అనుమతి ఇవ్వాలని అధికార పార్టీ శ్రేణులు జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు స్థానికంగా ప్రచారమవుతోంది. పురపాలక సంఘం ఇన్‌ఛార్జి ఏఈ వంశీకృష్ణ మాట్లాడుతూ కొన్ని కారణాల వల్ల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ఆగిపోయాయని, త్వరలో ప్రారంభం కావచ్చన్నారు.

# సృజనకు పదును.. ఆవిష్కరణలకు అదును




ఖమ్మం : భారతీయ భౌతికశాస్త్ర పరిశోధకుడు, శాస్త్రవేత్త చంద్రశేఖర వెంకటరామన్ 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారు. భౌతిక శాస్త్రంలో ఆయన అందించిన అపారమైన సేవలకు గుర్తుగా ఫిబ్రవరి 28ని జాతీయ సైన్స్ దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు.. బాలబాలికల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రకృతిని అర్థం చేసుకునే క్రమంలో ప్రశ్నించేతత్వాన్ని పెంచటం ద్వారా వారిని భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఏటా ఒక అంశంతో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు ఏర్పాటుచేస్తోంది. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక్ ప్రదర్శన, ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలోనూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలు జరుగుతాయి.

జాతీయ స్థాయిలో రాణింపు..ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు తయారుచేసిన పలు ప్రాజెక్టులు కితాబునందుకున్నాయి. గతేడాది జరిగిన పోటీల్లో ఏన్కూరు జడ్పీ ఉన్నత పాఠశాల, తల్లాడ బాలభారతి విద్యాలయం విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ తరపున పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు, క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, ప్రముఖ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.

విద్యార్థులకు వరం

రెండు దశాబ్దాల నుంచి సైన్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న 'జిల్లా సైన్స్ మ్యూజియం' కల ఎట్టకేలకు నెరవేరింది. ఖమ్మంలో పాత డీఈఓ కార్యాలయాన్ని దీని కోసం కలెక్టర్ వీపీ గౌతమ్ కేటాయించటంతో హర్షం వ్యక్తమవుతోంది. మ్యూజియం ఏర్పాటుకు ఇప్పటికే సుమారు రూ.42లక్షల నిధులున్నాయి.

ఈ సంవత్సరం 'థీమ్'..'గ్లోబల్ సైన్స్ ఫర్ గ్లోబల్ వెల్ బీయింగ్'(ప్రపంచ క్షేమం కోసం ప్రపంచమంతా సైన్స్) అనే అంశంపై విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తారు. పాఠశాలల్లో సైన్స్ రంగోళీ, సైన్స్ సెమినార్, క్విజ్, శాస్త్రీయ దృక్పథం పెంచే వివిధ రకాల పోటీలు నిర్వహిస్తారు.

86 మందికి ప్రోత్సాహకాలుఅన్ని యాజమాన్యాల్లోని విద్యాలయాల్లో జాతీయ సైన్స్ దినోత్సవం జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇన్‌స్పైర్ మనాక్‌కు ఎంపికైన ఒక్కో విద్యార్థికి రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో భద్రాద్రి జిల్లాలో 86 మంది ప్రోత్సాహకాలు అందుకోవడం విశేషం.

చలపతిరాజు, జిల్లా సైన్స్ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# ర్యాగింగ్.. వెంటాడే భూతం

ఖమ్మం : కళాశాలల్లో ఒకప్పుడు ర్యాగింగ్ భూతం ఎక్కువగా ఉండేది. కానీ చట్టంలోని శిక్షలు, విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలతో కొంతమేరకు తగ్గింది. కానీ అక్కడక్కడ వికృత రూపం దాల్చుతోంది. వరంగల్ కేయూ పీజీ వైద్య విద్యార్థి డాక్టర్ ధారావత్ ప్రీతినాయక్.. సీనియర్ వేధింపులకు బలయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఇంజినీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, మెడికల్ కళాశాలున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.అవగాహన కార్యక్రమాలు...ర్యాగింగ్ వల్ల కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి.సమస్య తీవ్రత, దానికి సంబంధించిన శిక్షలు, జరిమానాలను వివరించాలి. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా సంస్థలు కఠినమైన నిబంధనలు ప్రవేశపెట్టాలి. వాటి గురించి విద్యార్థులకు స్పష్టంగా తెలియజేయాలి.

ఇవీ జాగ్రత్తలు... అనుమతి లేకుండా బయటి వ్యక్తులు కళాశాల లేదా వసతిగృహాల్లోకి రాకూడదు. బాలికలు లేదా విద్యార్థినులు రాత్రి 9 గంటల లోపు వసతిగృహాల్లోకి తప్పనిసరిగా చేరుకోవాలి.కళాశాలకు వచ్చే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించాలి. కళాశాల ప్రిన్సిపల్, వార్డెన్లు ఆకస్మికంగా విద్యార్థుల వసతిగృహాలను సందర్శించాలి.కళాశాలల స్థాయిలో ఇలా...

తొలుత విద్యార్థి స్థాయిలో కమిటీ ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత



ప్రత్యేకంగా స్క్వాడ్‌ను నియమిస్తారు. ఇందులో అధ్యాపకులతో పాటు అన్ని విభాగాల అధిపతులు ఉంటారు. కళాశాల ప్రారంభం కాగానే మొదటి సంవత్సరం విద్యార్థులకు ర్యాగింగ్‌పై కార్యశాల నిర్వహిస్తారు. ద్వితీయ సంవత్సరం ప్రారంభం కాగానే ర్యాగింగ్‌కు పాల్పడబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తారు. స్వాగత వేడుకల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటారు. అప్పటి నుంచి జూనియర్, సీనియర్ విద్యార్థులు కళాశాలల్లో కలిసిమెలసి ఉంటారు. అన్ని విభాగాల విద్యార్థులతో ఒకచోట సమావేశం ఏర్పాటుచేయటం ద్వారా వారి మధ్య స్నేహభావం పెరుగుతుంది. ఆతర్వాత ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పిస్తారు. ఇందుకోసం విద్యార్థి కన్వీనర్, స్టాఫ్ కన్వీనర్ దగ్గర ఉన్న సెల్‌ఫోన్ నంబర్లు 24గంటల పాటు అందుబాటులో ఉంటాయి. ఇబ్బంది పడే విద్యార్థులు ఈ హెల్ప్‌లైన్ నంబర్లకు సమస్యను వివరిస్తారు.రాఘవన్ కమిటీ సిఫారసులు, యూజీసీ, ఏఐసీటీఈ మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు ఉత్తర్వులు ర్యాగింగ్ నిరోధక చట్టం, తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం ఏ విద్యార్థి అయినా ర్యాగింగ్‌కు పాల్పడినా... ప్రోత్సహించినా, సహకరించినా... ర్యాగింగ్ వ్యతిరేక చట్టం ప్రకారం శిక్షలు ఇలా ఉంటాయి...

పది సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష విధిస్తారు. సంబంధిత విద్యార్థి ప్రవేశం రద్దు చేసి కళాశాల నుంచి బహిష్కరిస్తారు.మరే ఇతర కళాశాలలో చేరే అవకాశం లేకుండా చేస్తారు.

షీటీమ్స్ ద్వారా కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎన్‌ఎస్‌ఎస్, స్థానిక పోలీసుల సహకారంతో తరచూ అవగాహన కల్పిస్తున్నాం. ర్యాగింగ్ లేదా ఇతర ఆకతాయి పనుల వల్ల జరిగే నష్టాల గురించి సదస్సుల్లో వివరిస్తున్నాం.

కె.రవిబాబు, డీఐఈఓ, ఖమ్మం

ప్రతిరోజూ నిర్వహించే ప్రతిజ్ఞలో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వారానికోసారి నైతిక విలువల గురించి బోధిస్తున్నాం. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ లాంటి వాటి జోలికి వెళ్లవద్దని చెబుతున్నాం. ఇంతవరకు ఒక్క ప్రభుత్వ పాఠశాలలోనూ ర్యాగింగ్ కేసు నమోదు కాలేదు. సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

# బయటి కార్యాలయాలన్నీ కలెక్టరేట్‌లోకి..

బచ్చన్నపేట : ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే దగ్గర ఉండాలని, ప్రజలకు పాలన మరింత చేరువ కావాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం హనుమకొండలో సమీకృత కలెక్టరేట్‌ను నిర్మించింది. అయినా కొన్ని కార్యాలయాలు బయటనే కొనసాగుతున్నాయి. వీటిని కలెక్టరేట్‌లోకి మార్చాలని పాలనాధికారి సిక్తా పట్నాయక్ ఆదేశించారు. ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఏయే శాఖలు బయట ఉన్నాయో గుర్తించారు. ప్రస్తుత భవనంలో ఎన్ని గదులు ఉన్నాయి, ఎన్ని శాఖలకు కేటాయించారు, ఇంకా ఎన్ని ఖాళీగా ఉన్నాయో తెలుసుకున్నారు. బయట కొనసాగుతున్న వాటిని ఇక్కడ సర్దుబాటు చేసే దిశగా చర్యలు చేపట్టారు.



ఎస్25లో ఉన్న సీపీవో కార్యాలయంలోకి హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్, ఎస్28లోని లీడ్ బ్యాంకు మేనేజర్ కార్యాలయంలోకి డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఎస్30లోని కార్మిక శాఖ కార్యాలయంలోకి ఆహారభద్రత, ఎస్16లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలోకి టీఎస్‌డబ్ల్యూఐడీసీ, ఎస్14లోని పౌర సరఫరాల శాఖ కార్యాలయంలోకి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ, ఎస్32లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలోకి గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాలు ఏర్పాటు చేసేలా సర్దుబాటు చేశారు. కొందరు అధికారులు మాత్రం ఒకదాంట్లో రెండు శాఖలను సర్దుబాటు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా అన్ని ఇక్కడే ఉండేలా చూడాలని కలెక్టర్ తేల్చి చెప్పడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇంకా విద్యా, వైద్య శాఖలను ఎక్కడ, ఎలా సర్దుబాటు చేయాలో అర్థం కావడం లేదని అధికారులు వాపోతున్నారు.

# ధరణి ధోరణి మారలే..!




ఖమ్మం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, జూలూరుపాడు, దుమ్ముగూడెం, చర్ల, దమ్మపేట, టేకులపల్లి మండలాల్లో మిస్సింగు సర్వే నంబర్లు, భూ విస్తీర్ణంలో తేడాలు వంటి సమస్యలు అధికంగా ఉత్పన్నమయ్యాయి. ఖమ్మం జిల్లా మధిర మండలంలో వందలాది ఎకరాలకు సంబంధించి రైతులకు పాసుపుస్తకాలు అందడం లేదు. రైతుబంధు, రైతు బీమా పథకాలకు నోచుకోవటం లేదని బాధిత రైతులు వాపోతున్నారు.భూదస్త్రాల ప్రక్షాళనే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ ద్వారా వేలాది సమస్యలకు పరిష్కారం లభించినా.. ఇంకా అనేక సమస్యలు కొలిక్కి రావడం లేదు. మిస్సింగు సర్వే నంబర్లు, భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులతో అన్నదాతలకు చిక్కులు ఎదురవుతున్నాయి. సాంకేతిక కారణాలతో ధరణిలో నమోదైన తప్పిదాలతో అర్హతలున్నా రైతులు.. ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు.వారసత్వ భూములు, మ్యుటేషన్లు, నిషేధిత భూముల జాబితా, గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్స్‌తోపాటు 33 రకాల మాడ్యూల్స్‌ను ప్రభుత్వం ధరణి పోర్టల్‌లో పొందుపరిచింది. భూదస్త్రాల సమస్యల పరిష్కారానికి తహసీల్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించేందుకు కలెక్టర్ల ఆధ్వర్యంలో పకడ్బందీ కార్యాచరణకు పూనుకుంది. ఉభయ జిల్లాల్లో మ్యుటేషన్లు, జీఎల్‌ఎం, నిషేధిత భూముల జాబితాలో వచ్చిన దరఖాస్తుల్లో సుమారు 85 శాతం సమస్యలను యంత్రాంగం పరిష్కరించింది. పాత 1-బీ దస్త్రాల్లోని భూముల వివరాలు.. కొత్త పాసుపుస్తకాల్లో తప్పుగా నమోదవటం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. ఖమ్మం జిల్లాలో ఈతరహా సమస్యలపై 7 వేల వరకు దరఖాస్తులు పేరుకుపోయాయి. భద్రాద్రి జిల్లాలో సుమారు 1,000కి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కొందరు రైతుల పాసుపుస్తకాల్లో సర్వే నంబర్లు లేకపోవడం లేదా భూవిస్తీర్ణంలో తేడాలు నమోదవటంతో ఈ దుస్థితి దాపురిస్తోంది. మిస్సింగు సర్వే నంబర్లు, భూ విస్తీర్ణంలో తేడాల పరిష్కారానికి టీఎం-33 పేరిట కొత్త మాడ్యూల్‌ను ప్రభుత్వం తీసుకురావడం వల్ల పెద్దఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో సమస్య పెండింగ్ అని కనిపిస్తుండటంతో.. కొందరు రైతులు రెండు, మూడుసార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేకుండా పోతోంది.

నాకు మూడెకరాల పట్టా భూమికి సంబంధించి ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన పాసుపుస్తకం ఉంది. గతంలో రైతుబంధు సాయమందింది. రెండేళ్లుగా 'రైతుబంధు' పథకం వర్తించట్లేదు. ఆన్‌లైన్‌లో మిస్సింగు సర్వే నంబర్ అని చూపుతోంది. అధికారుల సూచన మేరకు మీసేవ కేంద్రంలో 'ధరణి' పోర్టల్‌లో రెండుసార్లు దరఖాస్తు చేసినా సమస్య పరిష్కారం కాలేదు.

పోలెబోయిన వీర్రాజు, గంగాదేవిగుప్ప, పాల్వంచ మండలం

నాకు వారసత్వంగా రెండెకరాల భూమి వచ్చింది. ఈభూమికి సంబంధించి గతంలో పాసుపుస్తకాలు ఉన్నాయి. కానీ ఇప్పుడు ధరణి పోర్టల్‌లో ఆ వివరాలు లేవు. ఆన్‌లైన్‌లో మిస్సింగ్ సర్వే నంబర్ అని చూపుతోంది. కొత్త పాసుపుస్తకం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను.

దేవిశెట్టి నాగేశ్వరరావు, బుచ్చిరెడ్డిపాలెం, మధిర మండలం

'ధరణి'లో వేలాది భూ సమస్యలను పరిష్కరిస్తున్నాం. ప్రభుత్వం ఇటీవల టీఎం-33 మాడ్యూల్‌ను 'ధరణి'లోకి తీసుకొచ్చింది. దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియలో వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొద్దిరోజుల్లోనే అన్ని దరఖాస్తులకు మోక్షం లభిస్తుంది.

దురిశెట్టి అనుదీప్, కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

# వేధిస్తున్న పశు వైద్యుల కొరత

బచ్చన్నపేట : జిల్లాలోని పశువైద్యశాలలు సమస్యల నిలయంగా మారాయి. వైద్యులు, సిబ్బంది కొరత, శిథిలావస్థకు చేరిన భవనాలు తదితర సమస్యలు నెలకొన్నాయి. పలు చోట్ల ఇన్‌ఛార్జి వైద్యాధికారులే ఉండడంతో వారానికోసారి వచ్చి సేవలందిస్తున్నారు. దీంతో పశువులకు వైద్య సేవలు అందడం లేదని పాడి రైతులు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల పరిధిలో 47 పశు వైద్యశాలలు ఉన్నాయి. వీటిలో ఏరియా ఆసుపత్రులు 4 ఉండగా, ప్రాథమిక పశువైద్యశాలలు 23, పశువైద్య ఉపకేంద్రాలు 20 ఉన్నాయి. 23 ఆసుపత్రుల్లో ఒక్కో దానిలో ఒక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, ఒక వెటర్నరీ అసిస్టెంట్, ఒక కంపౌండర్ ఉండాలి. ఉప కేంద్రాల్లో ఒక జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్, ఒక కంపౌండర్ ఉండాలి. పలు ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత ఉంది.

అరకొరగా సిబ్బందితో అందని వైద్యం

జిల్లా వ్యాప్తంగా ఆసుపత్రుల్లో 23 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 8 మంది, 85 మంది సిబ్బందికి గాను 48 మంది మాత్రమే ఉన్నారు. ఒప్పంద ప్రాతిపదికన ఆరుగురు వైద్యులు పని చేస్తుండగా ఇద్దరు డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. మార్చి 31తో వారి కాల పరిమితి ముగియనుంది. కొన్ని చోట్ల వైద్య సిబ్బంది కొరత మరికొన్ని చోట్ల సిబ్బంది ఉన్నప్పటికీ వారు అందుబాటులో లేకపోవడంతో పశువులకు వైద్యసేవలు




అందడం లేదు. దూర ప్రాంతాల నుంచి ఆసుపత్రులకు వచ్చే రైతులు సిబ్బంది లేకపోవడంతో నిరాశతో తిరిగి వెళ్తున్నారు.

ఉన్నతాధికారులకు లేఖ రాశాం- జి.నర్సయ్య, ఏడీ, పశుసంవర్ధక శాఖ

జిల్లాలో పశు వైద్యుల కొరత ఉంది. ప్రస్తుతం 8 మంది ఉండగా వారికి ఇతర మండలాల బాధ్యతలు అప్పగించి సేవల్లో ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. పశు వైద్యుల నియామకానికి సంబంధించి ఉన్నతాధికారులకు ఇటీవల లేఖ రాశాం. గతంలో ఆరుగురు వైద్యులు ఒప్పంద పద్ధతిలో పని చేయగా వారి కాలపరిమితి మార్చి 31తో ముగియనుంది. ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం.

# వలస జీవితం అగమ్యగోచరం

ఖమ్మం : పొట్ట చేతబట్టుకుని రాష్ట్రాలు దాటొచ్చి కూలీ పనులు చేసుకుంటున్న వారి బిడ్డల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. తల్లిదండ్రులు పొలాల్లో ఉండటంతో చిన్నారుల ఆలనాపాలనా చూసేవారే కరవవుతున్నారు. చిన్నారులకు సమయానికి తిండి దొరకటం లేదు. వారి చదువులు సైతం అర్థాంతరంగా ఆగిపోవాల్సిన దుస్థితి. 8వేల మంది వలస కూలీలు రాక

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అధికంగా మిరప, పత్తి, వరి, మొక్కజొన్నతో పాటు జామాయిల్, సుబాబుల్ సాగుచేస్తున్నారు. కర్రనరకడంతో పాటు మిరపకాయలు ఏరేందుకు స్థానికంగా కూలీలు చాలకపోవడంతో రైతులు బయటి ప్రాంతాల నుంచి ఇక్కడకు రప్పిస్తుంటారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి అధికంగా కూలీలు వస్తుంటారు. పని ప్రదేశాల్లో గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తారు. విద్యా సంవత్సరం పూర్తి కాకముందే ఇక్కడకు రావడంతో వారి పిల్లల చదువులపై ప్రభావం పడుతోంది. సరైన పోషకాహారమూ అందక చిన్నారుల ఆరోగ్యం దెబ్బతింటోంది. నెలల పిల్లలను సైతం గట్టు మీద ఉయ్యాలలో పడుకోబెట్టి కూలీలు పనుల్లో



నిమగ్నమవుతుంటారు. ఈఏడాది ఇప్పటికే 8వేల మంది వలస కూలీలు ఉభయ జిల్లాలకు వచ్చినట్లు సమాచారం.

'పని' ఒప్పందం ఇలా..

వ్యవసాయ బావులు, మోటర్ల నుంచి తాగునీటిని తెచ్చుకుని వలస కూలీలు కాలం గడుపుతున్నారు. తొలుత ఆయా రాష్ట్రాల్లో కూలీలను ఇక్కడి పెద్ద రైతులు ఒక్కొక్కరు 30 నుంచి 40 మందిని ప్రత్యేక వాహనాల్లో తీసుకొస్తారు. సదరు రైతు మిరప, సుబాబుల్ పనులు పూర్తయ్యాక మరో కర్షకుడు వారితో 'పని' ఒప్పందం కుదుర్చుకుంటారు. ఒక్కో కిలో మిరప ఏరినందుకు రూ.10 చొప్పున.. తోట ఏరటం పూర్తయ్యాక రైతులు చెల్లిస్తారు. రోజువారీగా నిత్యావసర సరకుల కొనుగోలుకు పనిలో 50శాతం కూలిని లెక్కకట్టి నగదు ఇస్తుంటారు. కొన్ని గ్రామాల్లో పెద్ద రైతులు మాత్రం వారానికి సరిపడా బియ్యం, కూరగాయలు ఇస్తుండటంతో వాటితో వలస కూలీలు సరిపెట్టుకుంటున్నారు.

తాత్కాలికంగా గుర్తింపును రద్దు చేసుకుంటేనే..

ఉభయ జిల్లాలకు వలస వచ్చిన కూలీల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సుమారు 3 వేల మంది వరకు ఉంటారు. స్వరాష్ట్రంలో మాదిరిగా ఇక్కడ పోషకాహార పదార్థాలు అందక అవస్థలు పడుతున్నారు. గతంలో పని ప్రదేశానికి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి వివరాలు నమోదు చేయించుకుని సరకులు తెచ్చుకునేవారు. ప్రస్తుతం కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు సరకుల పంపిణీకి నూతన విధానం తీసుకురావడంతో వలస కూలీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ సరకులు తీసుకోవాలంటే సొంత రాష్ట్రాల్లో తాత్కాలికంగా గుర్తింపును రద్దు చేసుకోవాల్సి ఉంటుంది. ఈమేరకు అవగాహన లేకపోవటం, ఇక్కడి భాష పూర్తిగా రాకపోవడం ప్రతిబంధకంగా మారింది. బలహీనంగా ఉన్న చిన్నారులకు స్థానిక అధికారులు బాలామృతం అందిస్తున్నా దాన్ని తెచ్చుకునేందుకు ఎక్కువ శాతం కూలీలు వెళ్లడం లేదు. ఆయా ప్రాంతాలకు వలస వచ్చే కూలీల్లో అర్హులకు ఐసీడీఎస్ సిబ్బంది పోషకాహారం అందిస్తేనే ప్రభుత్వాల లక్ష్యం నెరవేరుతుంది.

# తునికాకు కూలీలకు బోనస్ డబ్బులు

భూపాలపల్లి : కొన్ని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న తునికాకు కూలీలకు ప్రభుత్వం ఎట్టకేలకు బోనస్ డబ్బులు విడుదల చేసింది. ఇప్పటికే అధికారులు తునికాకు కూలీలకు సంబంధించిన బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించారు. అయితే ప్రయోగాత్మకంగా ఆసిఫాబాద్ జిల్లాలో బోనస్ డబ్బులు పంపిణీ చేసిన తర్వాతనే మిగతా అన్ని జిల్లాల్లో అధికారులు పంపిణీ చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఏటా అడవుల్లోకి వెళ్లి తునికాకు సేకరించి వాటిని విక్రయించగా వచ్చిన బోనస్ డబ్బులను ప్రభుత్వం కొన్నేళ్లుగా చెల్లించడం లేదు. ఈ మేరకు 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న నగదును చెక్కుల రూపంలో అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో కూలీల్లో సంతోషం వ్యక్తమవుతోంది. జిల్లాలోని భూపాలపల్లి, మహదేవపూర్ అటవీ డివిజన్‌లలో 22,654 మంది కూలీలకు సంబంధించి బోనస్ డబ్బులు రూ.2.84 కోట్లు వరకు ప్రభుత్వం పంపిణీ చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లపై అధికారు



లు కసరత్తు చేస్తున్నారు. త్వరలోనే కూలీలకు డబ్బులు అందించనున్నారు. జిల్లాలో మొత్తం తునికాకు యూనిట్లు 35 వరకు ఉన్నాయి. రెండేళ్ల క్రితం 43 యూనిట్లు ఉంటే ఈ ఏడాది 35 వరకే తగ్గించారు. ఏటా తునికాకు యూనిట్ల సంఖ్య తగ్గుతూ వస్తోంది. అడవుల్లో నాణ్యమైన ఆకు లభించకపోవడమే కాకుండా కూలీలు కూడా సేకరణపై మొగ్గు చూపడం లేదు. ఈ మేరకు 2012 నుంచి 2014 వరకు కూలీల బోనస్ డబ్బులు సంబంధిత అటవీ రేంజి కార్యాలయాల్లో నిల్వ ఉన్నాయి.వేసవిలో ఆకు సేకరణే ఆధారం..వేసవిలో ఎక్కువగా గిరిజనులు అడవులే ఆధారంగా జీవిస్తుంటారు. అధిక శాతం కుటుంబాలు అటవీ ఉత్పత్తులను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతుంటారు. అయితే వేసవిలో వ్యవసాయ పనులు ఉండకపోవడంతో తునికాకు సేకరణపైనే దృష్టి పెడుతారు. జిల్లాలో 2017 వరకు ఎక్కువగా కూలీలు తునికాకు సేకరణపై ఆధారపడేవారు. క్రమంగా ఆసక్తి సన్నగిల్లుతూ వస్తోంది. కరోనా సమయంలో చాలా మంది దీనికి దూరమయ్యారు. ముఖ్యంగా అటవీ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులతో ఆకుసేకరణపై మొగ్గుచూపడం లేదని అటవీ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు కూలీలను ప్రోత్సహించటానికే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బోనస్ డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఈ ఏడాదిలో ఆకు సేకరణకు ఆన్‌లైన్ ద్వారా తునికాకు యూనిట్ల టెండర్ల ప్రక్రియ మొదలైంది. వచ్చె నెల 15వ తేదీ వరకు టెండర్లకు గడువు ఉంది.



## తెలుగు విద్యార్థిని మృతి కేసు.. అమెరికా పోలీసుల తీరును ఖండించిన భారత్

దిల్లీ: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు విద్యార్థిని మృతి చెందిన ఘటనలో సియాటిల్ నగరానికి చెందిన పోలీసు అధికారి చులకనగా మాట్లాడిన వీడియోపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ దృశ్యాలపై వెంటనే దర్యాప్తు జరపాలని అమెరికాను కోరింది. ఈ మేరకు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత దౌత్యకార్యాలయం ట్వీట్ చేసింది. 'జాహ్నవి కందుల మృతి కేసు విచారణలో భాగంగా తాజాగా వెలుగులోకి వచ్చిన కథనాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి. సియాటిల్ అలాగే వాషింగ్టన్‌లోని ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశాం. అలాగే సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నాం' అని దౌత్యకార్యాలయం వెల్లడించింది. కర్నూలు జిల్లా ఆదోని ఎంఐజీ కాలనీకి చెందిన కందుల జాహ్నవి(23) డిగ్రీ పూర్తి చేసిన తర్వాత.. ఉన్నత చదువుల నిమిత్తం 2021లో అమెరికా వెళ్లింది.

ఈ ఏడాది జనవరి 23న కళాశాలకు వెళ్లి రాత్రి సమయంలో ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా పోలీసు పెట్రోలింగ్ వాహనం ఆమెను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఈ ఘటనపై సియాటిల్ నగరానికి చెందిన ఓ పోలీసు అధికారి జోకులు వేసుకుంటూ నవ్వుతూ మాట్లాడారు. ఆ మాటలన్నీ అతడి శరీరానికి అమర్చిన కెమెరాలో రికార్డయ్యాయి. అవి తాజాగా వెలుగులోకి రావడంతో ఆయన తీరుపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.



## చైనా 'బ్యాగుల' కలకలం. రెండు కాదు.. మొత్తం 20 బ్యాగులట..!

దిల్లీ: జీ20 సదస్సు లో చైనా ప్రతినిధుల బృందం వెంట ఉన్న కొన్ని బ్యాగులు అనుమానాస్పదంగా కనిపించడం కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. తొలుత రెండు బ్యాగులని వార్తలు రాగా.. మొత్తం 20 అనుమానాస్పద బ్యాగులు కన్పించినట్లు తాజాగా పలు మీడియా సంస్థల కథనాలు వెల్లడించాయి. అంతేగాక, వాటిలో నిఘా పరికరాలు ఉండి ఉంటాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీ20 సదస్సు కోసం విచ్చేసిన ఆరుగురు ప్రతినిధుల చైనా బృందం దిల్లీలోని ఓ ప్రముఖ హోటల్‌లో బస చేసింది. అయితే, వారి వెంట తెచ్చుకున్న బ్యాగుల్లో కొన్ని అసాధారణ కొలతల్లో కన్పించాయి. సాధారణంగా విదేశాల నుంచి వచ్చే వారి వస్తువులను ఎయిర్‌పోర్టులోనే పూర్తిగా తనిఖీ చేస్తారు. కానీ, 'వియన్నా ఒప్పందం' కింద ఉన్న దౌత్యపరమైన ప్రొటోకాల్స్ ప్రకారం.. చైనా ప్రతినిధుల వస్తువులను ఎయిర్‌పోర్టులో స్కాన్ చేయకుండానే పంపించారు. అయితే, హోటల్‌కు చేరుకున్నాక అక్కడి భద్రతా సిబ్బంది.. ఆ బ్యాగుల సైజులు అసాధారణంగా ఉన్నట్లు గుర్తించారు. 1%ఇ%1 మీటర్ల పొడవు, వెడల్పు, మందంగా ఉన్న ఆ బ్యాగులను స్కానర్ కింద ఉంచాలని సదరు ప్రతినిధులను భద్రతా అధికారులు కోరారు. అందుకు వారు నిరాకరించడంతో కొంతసేపు హైడ్రామా నెలకొంది. 12 గంటల సుదీర్ఘ చర్చల తర్వాత చైనా అధికారులు ఆ బ్యాగ్‌లను ఎంబసీకి పంపడానికి అంగీకరించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. మొత్తం 20 బ్యాగులు ఇలా సైజుల్లో ఉన్నట్లు తాజాగా పలు మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఆ బ్యాగుల్లో ఏముందన్నది మాత్రం తెలియరాలేదు. అందులో 'ఆఫ్ ది ఎయిర్' నిఘా పరికరాలు ఉండి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై భద్రతా సిబ్బంది దర్యాప్తు ప్రారంభించినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. కాగా.. ఈ వ్యవహారంపై చైనా ఎంబసీ గానీ, ఆ దేశ ప్రభుత్వం నుంచి గానీ ఎలాంటి స్పందన రాలేదు.



## తైవాన్‌ను చుట్టేస్తున్న చైనా

హాంకాంగ్: తైవాన్‌ను ఎలాగైనా ఆక్రమించేందుకు చైనా తన కుయత్నాలను ముమ్మరం చేసింది. ఈ ద్వీపం తమ దేశంలోని భాగమేనని వాదిస్తున్న డ్రాగన్.. తాజాగా దీన్ని తమ భూభాగంలో విలీనం చేసుకొనేందుకు ఓ ప్రణాళికను ఆవిష్కరించింది. ఈ బ్లూప్రింట్‌ను విడుదల చేయడానికి ముందు.. తైవాన్‌ను బెదిరించేందుకు ఆ ద్వీపం దిశగా చైనా యుద్ధనౌకలను పంపించింది. చైనాలో తీర ప్రావిన్స్ ఫుజియాన్, తైవాన్ మధ్య జలసంధుల పరస్పర సహకారాన్ని బలోపేతం చేసే విధంగా డ్రాగన్ ఇటీవల ఓ ప్రణాళికను ఆవిష్కరించింది. తైవాన్ భవిష్యత్తు అభివృద్ధికి బ్లూప్రింట్‌గా చెబుతున్న ఈ ప్లాన్ చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ విడుదల చేసింది. తైవాన్‌తో సమగ్ర అభివృద్ధికి ఫుజియాన్‌ను 'ప్రత్యేక జోన్'గా మార్చడంతో పాటు తైవాన్ నివాసితులు చైనాలో స్థిరపడేందుకు, ఇక్కడ వ్యాపారాలు చేసేందుకు వీలుగా ఫుజియాన్‌ను 'ఫస్ట్ హోం'గా పేర్కొంటూ ఈ ప్రణాళికను ఆవిష్కరించినట్లు డ్రాగన్ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, తైవాన్ చుట్టూ యుద్ధ మేఘాలు అలుముకున్న వేళ.. చైనా ఈ బ్లూప్రింట్‌ను తీసుకురావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత వారాంతంలో అమెరికా, కెనడాలకు చెందిన యుద్ధనౌకలు తైవాన్ జలసంధిలో ప్రయాణించి చైనా దుందుడుకు చర్యలను సవాలు చేశాయి. దీంతో ఆగ్రహించిన డ్రాగన్.. సోమవారం తన యుద్ధనౌకల దండును తైవాన్ జలసంధిలోకి పంపించింది. సైన్యం ఇక్కడ యుద్ధవిమానాలు, జలాంతర్గాముల సన్నద్ధత, ఇతర యుద్ధ విన్యాసాలను చేపడుతుందని చైనా మీడియా వెల్లడించింది. మరోవైపు వచ్చే ఏడాది జనవరిలో తైవాన్‌లో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో చైనా కొత్త బ్లూప్రింట్‌ను ఆవిష్కరించడం గమనార్హం. అయితే, దీనిపై తైవాన్ చట్టప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. ఇది 'హాస్యాస్పదం' అంటూ డ్రాగన్‌పై మండిపడ్డారు.

## తిరుమల బ్రహ్మోత్సవాలు.. వాహనసేవ వీక్షణకు టీటీడీ చర్యలు

తిరుమల: తిరుమలలో బ్రహ్మోత్సవాలపై టీటీడీ ఈవో ధర్మారెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. భక్తులు వాహనసేవ వీక్షించడానికి మాడవీధులను పరిశీలించినట్టు చెప్పారు. కాగా, ఈవో ధర్మారెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. 18వ తేదీన రాష్ట్రప్రభుత్వం తరఫున శ్రీవారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గరుడోత్సవం రోజు దగ్గరంగా వాహనసేవను వీక్షించడానికి మాడవీధులను పరిశీలించామన్నారు. గ్యాలరీలలో 2 లక్షల మంది భక్తులు వాహనసేవలు వీక్షిస్తారు. అందరూ వాహనసేవలు వీక్షించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం అని తెలిపారు. మరోవైపు.. టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల నిమిత్తం అదనంగా మరో 100 ఎకరాల భూమి కేటాయింపుపై మంత్రి రోజాతో టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చర్చించారు.

పాధిరేడు అరణ్యం వద్ద గతంలో 300 ఎకరాలు ప్రభుత్వం కేటాయిం చింది. ఈ క్రమంలో నగరిలోని తన నివాసం వద్ద భూమనను మంత్రి రోజా సత్కరించారు.






## రాజకీయ కక్షతోనే చంద్రబాబు అరెస్టు

కరీంనగర్: తెదేపా అధినేత చంద్రబాబును రాజకీయ కక్షతోనే అరెస్టు చేశారనే విషయం అర్థమవుతోందని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు.

కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తప్పు చేస్తే అరెస్టు చేయడాన్ని ఎవరూ కాదనరని చెప్పారు. కానీ, ఎఫ్‌ఐఆర్‌లో పేరు లేని వ్యక్తిని అరెస్టు చేయడమే తనకు అర్థం కావడం లేదన్నారు. చంద్రబాబు అరెస్టు అక్రమమని ప్రజలు తిరగబడే పరిస్థితి భవిష్యత్‌లో వస్తుందన్నారు. మాజీ సీఎంను ఆదరాబాదరాగా అరెస్టు చేయాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

జీ-20 సమావేశాల సమయంలోనే అరెస్టు చేయడానికి పోలీసులకు సమయం కుదిరిందా అని ప్రశ్నించారు. తాజా అరెస్టుతో ఏపీ ప్రజల్లో చంద్రబాబుకు మైలేజ్ వచ్చిందని తెలిపారు. తప్పును తప్పు అని చెబితే చంద్రబాబు ఏజెంట్ అని ముద్ర వేసే దురలవాటు వైకాపా నేతలకు ఉందని విమర్శించారు.



## అరెస్టులకు భయపడం.. న్యాయ పోరాటం చేస్తాం

## జగన్ చేసిన ప్రతితప్పునూ ప్రజాక్షేత్రంలో ఎండగడతాం: లోకేశ్

రాజమహేంద్రవరం: తమ అధినేత చంద్రబాబు సింహం లాంటి వ్యక్తి అని.. ఆయన దేనికీ భయపడరని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పష్టం చేశారు. చంద్రబాబు జైలు లోపల ఉన్నా సీఎం జగన్‌కు చెమటలు పట్టిస్తున్నారన్నారు. రాజమహేంద్రవరంలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణతో నారా లోకేశ్ మాట్లాడారు.

**జనసేనతో కలిసి పోటీపై కమిటీ :** "హైదరాబాద్‌ను ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి చంద్రబాబు. సైబర్ టవర్స్ నిర్మించి లక్షల మందికి ఉపాధి కల్పించారు. చంద్రబాబు ఏ ఒక్క వర్గానికి కూడా ద్రోహం చేయలేదు. అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చి అమలు చేశారు. ఆధారాలు లేకుండా స్కామ్ జరిగిందని ఇప్పుడు ఆయనపై కేసు పెట్టారు. చట్టాలను చుట్టాలుగా మారిస్తే సివిల్ వార్ మొదలుపెట్టాలి. వచ్చే ఎన్నికల్లో జనసేనతో కలిసి పోరాటం చేసే అంశంపై కమిటీ ఏర్పాటు చేస్తాం. జగన్ చేసిన ప్రతి తప్పును ప్రజాక్షేత్రంలో ఎండగడతాం.

**ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి? :** కలిసికట్టుగా పోరాడాలనేది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల అభిప్రాయం. ఇరు పార్టీల చర్చల తర్వాత కార్యాచరణ ప్రకటిస్తాం. ప్రజల తరఫున పోరాడుతున్న తెదేపా, జనసేన నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడుతున్నారు. నేను ఎలాంటి తప్పు చేయలేదు. అయినా.. లోకేశ్‌ను జైలుకు పంపిస్తామని వైకాపా మంత్రులు చెబుతున్నారు. ప్రజల కోసం పోరాడుతున్నందుకే చంద్రబాబును జైల్లో పెట్టారు. అందుకే కలిసికట్టుగా పోరాడుతామని పవన్ కల్యాణ్ జైలు వద్దే ప్రకటించారు. పవన్ కల్యాణ్ లాంటి నాయకుడిని రాష్ట్రంలో అడుగు పెట్టకుండా అడ్డుకున్నారంటే... సామాన్యుడు తిరిగే పరిస్థితి ఉంటుందా?" అని లోకేశ్ ప్రశ్నించారు.

**చంద్రబాబు చాలా ధైర్యంగా ఉన్నారు: బాలకృష్ణ –** చంద్రబాబు చాలా ధైర్యంగా ఉన్నారని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వెల్లడించారు. "రాష్ట్రాన్ని కాపాడుకోవాలనేదే చంద్రబాబు తపన. రాష్ట్రాభివృద్ధికోసం ఏం చేయాలనేదానిపై పవన్, చంద్రబాబు చర్చించారు. ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి, ప్రతిపక్షాలపై దాడికి పాల్పడే వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండటం మన దౌర్భాగ్యం. ఎమర్జెన్సీ సమయంలో కూడా ఇలాంటి ఘోరం జరగలేదు. తెలుగు జాతికి నందమూరి తారాకరామారావు ఒక గుర్తింపు తెచ్చారు. ఈరోజు ఉనికి కోల్పోయాం. రాష్ట్రమే కాదు.. దేశ ప్రజలంతా చంద్రబాబు అరెస్టుపై సానుభూతి ప్రకటిస్తున్నారు" బాలకృష్ణ తెలిపారు.

## చంద్ర్రబాబుతో పవన్ ములాఖత్ అందుకే..: చినరాజప్ప

రాజమహేంద్రవరం: తెదేపా అధినేత చంద్రబాబును పరామర్శించేందుకే జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ములాఖత్ అవుతున్నారని ఏపీ మాజీ మంత్రి చినరాజప్ప తెలిపారు.

పొత్తుల అంశం ఇప్పుడు చర్చకు రాకపోయినా.. ఐక్య కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా తెదేపా-జనసేన కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ఇవాళ మధ్యాహ్నం 12గంటలకు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో చంద్రబాబుతో పవన్ కల్యాణ్, బాలకృష్ణ, లోకేశ్ ములాఖత్ కానున్నారు. కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉంది. బాలకృష్ణ హైదరాబాద్ నుంచి ఇప్పటికే రాజమహేంద్రవరం చేరుకున్నారు. సోదరి భువనేశ్వరి, కుమార్తె బ్రాహ్మణితో సమావేశమయ్యారు.



## అంగళ్లు ఘటనలో చంద్రబాబు పిటిషన్.. హైకోర్టులో విచారణ వాయిదా

అమరావతి: అన్నమయ్య జిల్లా అంగళ్లు ఘటనలో పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో బెయిల్ కోరుతూ తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 20వ తేదీకి వాయిదా పడింది. కేసు పూర్తి వివరాలతో హాజరు కావాలని పోలీసులను ఏపీ హైకోర్టు ఆదేశించింది. నీటి ప్రాజెక్టుల సందర్శనకు వెళ్తున్న సమయంలో అంగళ్లు వద్ద తెదేపా, వైకాపా వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. అధికార పార్టీ కార్యకర్తలు తమపై రాళ్లు విసిరారని చంద్రబాబు పిటిషన్ వేశారు. తన సెక్యూరిటీ సిబ్బంది కాపాడారని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. తెదేపా అధినేత చంద్రబాబు పర్యటన సందర్భంగా అన్నమయ్య జిల్లా అంగళ్లలో చోటుచేసుకున్న సంఘటనల నేపథ్యంలో పోలీసులు 179 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే చంద్రబాబును ఏ-1గా చేర్చారు. హత్యాయత్నంతో పాటు వివిధ సెక్షన్ల కింద అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం ముదివేడు పోలీసులు ఈ కేసులు నమోదు చేశారు. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' పేరిట గత నెల 4న అన్నమయ్య జిల్లాలో చంద్రబాబు పర్యటించారు. అంగళ్లు మీదుగా ఆయన వెళుతున్నప్పుడు వైకాపా శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడడం, తెదేపా కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నమోదుచేసిన ఎఫ్‌ఐఆర్‌లో తొలుత 20 మంది తెదేపా క్రియాశీల నాయకుల పేర్లను ప్రస్తావించారు.




పరిస్థితినిబట్టి మరి కొందరిపై కేసుల నమోదుకు వీలుగా ఇతరులంటూ ఎఫ్‌ఐఆర్‌లో నమోదు చేశారు. ఇతరుల కింద 159 మందిపై కేసులు నమోదయ్యాయి. వారిలో 139 మంది పీలేరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలున్నారు.

## చంద్ర్రబాబు స్కిల్ స్కాంలో 10 కీలక అంశాలు: ఏపీ సీఐడీ

విజయవాడ: స్కిల్ స్కామ్‌లో రూ. 371 కోట్ల అవినీతి జరిగిందని ఏపీ సీఐడీ చీఫ్ సంజయ్ అన్నారు. గురువారం.. మీడియా సమావేశంలో ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డితో కలిసి మాట్లాడిన ఏపీ సీఐడీ.. ఈ స్కామ్‌లో మొత్తం 10 కీలక అంశాలు ఉన్నాయని పేర్కొంది. "నిబంధనలకు విరుద్ధంగా రూ.371 కోట్లను రిలీజ్ చేశారు. అధికారుల అభ్యంతరాలను నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. తప్పుడు డాక్యుమెంట్లతో ఒప్పందాలు చేసుకున్నారు. ప్రభుత్వం జీవోకు,అగ్రిమెంట్‌కు చాలా తేడాలున్నాయి. అగ్రిమెంట్‌లో జీవో నంబర్‌ను చూపించలేదు. జీవోలో ఉన్న అంశాలు అగ్రిమెంట్‌లో లేవు" అని సీఐడీ వివరించింది.



## బ్లాక్ డ్రెస్ లో పాయల్ పరువాల విందు..!

పాయల్ రాజ్ పూత్ కి పరిచయం అవసరం లేదు. ఆమె అందానికి ఎవరైనా ఫిదా కావాల్సిందే. ఆర్ఎక్స్ 100 సినిమాతో ఆమె టాలీవుడ్ లో కెరీర్ మొదలుపెట్టింది. ఆ సినిమాలో పాయల్ క్యారెక్టర్, అందానికి అందరూ ఫిదా అయిపోయారు. ఆ సినిమాలో ఆమె కొంచెం నెగిటివ్ షేడ్స్ లో నటించింది. మొదటి సినిమాకే, అలాంటి రోల్ చేయడం సాహసమనే చెప్పాలి. కాగా, పాయల్ సోషల్ మీడియాలో యమా యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలను షేర్ చేస్తూనే ఉంటుంది. ముఖ్యంగా బోల్డ్ ఫోటో షూట్ చేయడంలో పాయల్ ఎప్పుడూ ముందుంటుంది. కానీ, తాజాగా



మాత్రం బ్లాక్ కలర్ డ్రెస్ లో మోడ్రన్ టచ్ ఇచ్చింది. ఈ డ్రెస్ లో పాయల్ చాలా అందంగా ఉంది. ఆ డ్రెస్ కి కరెక్ట్ గా సెట్ అయ్యేలా ముస్తాబైంది. ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారాయి. అయితే, ఈ మధ్య పాయల్ తెరపై కనిపించి చాలా రోజులు అవుతోంది. ఈ క్రమంలో 'మంగళవారం' అనే సినిమాతో మన ముందుకు రావడానికి రెడీ అయ్యింది. ఈ మూవీ ట్రైలర్ కూడా ఇటీవల విడుదల చేయగా, విపరీతంగా ఆకట్టుకుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తో మళ్లీ హిట్ కొడతాననే నమ్మకంతో పాయల్ ఉంది. ఆర్ఎక్స్100 తో హిట్ కొట్టిన అజయ్ భూపతి, ఆ తర్వాత మహా సముద్రం సినిమా తీశారు. సిద్ధార్థ్, శర్వా లాంటి స్టార్స్ నటించిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. దీంతో, ఈసారి అజయ్ రూట్ మార్చి, ఇంట్రస్టింగ్ కథతో మన ముందుకు రావడానికి రెడీ అయ్యారు. మరి ఈ మూవీతో పాయల్ మళ్లీ ఫామ్ లోకి వస్తుందో లేదో చూడాలి. ఇదిలా ఉండగా, ప్రస్తుతం పాయల్ చేతిలో రెండు, మూడు సినిమాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఓ వైపు మాయా పేటిక అనే సినిమా చేస్తోంది. ఈ మూవీ కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ప్రేమలో పడిన రాశీఖన్నా?

దిల్లీ బ్యూటీ రాశీఖన్నా ముంబై పరిశ్రమలో నెమ్మదిగా తన పరిధిని విస్తరిస్తోంది. అంతేకాదు.. ఇండస్ట్రీలో తన స్నేహాలను కూడా పెంచుకుంటోంది. అంతేకాదు ఇప్పుడు రాశీ ప్రేమలో పడిందని సమాచారం. అయితే రాశీ ఎవరితో ప్రేమలో పడింది? తన సహచరి, స్నేహితురాలు తమన్నా తరహాలో కోస్టార్ తో ప్రేమలో పడిందా? అంటే అలాంటిదేమీ లేదు. ఇటీవలే రాశీ ఓ ప్రేమకథ విందిట. ఆ స్క్రిప్టుతో ప్రేమలో పడిందని తెలిసింది. ఒక అందమైన అమ్మాయి చిన్న టౌన్ నుంచి మెట్రో నగరంలోకి అడుగుపెడుతుంది. అక్కడ ఒక ఆకతాయి అబ్బాయితో స్నేహం చేసి అతడితో నిండా ప్రేమలో మునుగుతుంది. అటుపై ఆ ఇద్దరి జీవితాల్లో ఏం జరిగిందనేదే ఈ సినిమా కథాంశం. ఇక ఆకతాయి కుర్రాడిగా యువహీరో విక్రాంత్



మాస్సే నటిస్తుండగా, అందాల రాశి ఖన్నా అతడి ప్రేయసిగా కనిపించనుంది. ఈ చిత్రానికి నూతన దర్శకుడు బోధయన్ రాయ్ చౌదరి దర్శకత్వం వహించనున్నారు. ముంబై నేపథ్యంలో సాగే ఓ చమత్కారమైన ప్రేమకథతో ఈ సినిమా రూపొందనుందని సమాచారం. షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైందని, నవంబర్ 2023 నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నామని, 2024 ప్రథమార్థంలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నామని మేకర్స్ చెబుతున్నారు. ఇద్దరు ప్రతిభావంతులు ఎవరికి వారు కెరీర్ పరంగా ఫుల్ స్వింగ్ లో ఉన్నారు. విక్రమ్ మాస్సే -రాశీ ఖన్నా ఇద్దరూ ఇటీవల వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. మాస్సే గ్యాస్‌లైట్ - ముంబైకర్ చిత్రాల్లో అద్భుత నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. మాస్సే ప్రస్తుతం విధు వినోద్ చోప్రా 'ట్వల్త్ ఫెయిల్' విడుదల కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ చిత్రం అక్టోబర్ 27 న థియేటర్లలోకి రానుంది. మరోవైపు రాశీ ఖన్నా మద్రాస్ కేఫ్‌తో హిందీ సినిమాలో కెరీర్ ప్రారంభించి, ఇటీవలే రాజ్ అండ్ డీకే ఫర్జీ వెబ్ సిరీస్‌లోను నటించి మెప్పించింది. రుద్ర అనే వెబ్ సిరీస్ తోను పేరు తెచ్చుకుంది. తదుపరి 'యోధా'లో రాశీ ఒక కీలక పాత్రను పోషించింది.




## రూల్స్ రంజన్ భయపడ్డాడు





'ఎస్ఆర్ కళ్యాణమండపం' చిత్రంతో ఉన్నట్లుండి ఫేమ్, క్రేజ్ సంపాదించి.. ఆ తర్వాత సరైన సినిమాలు చేయక వెనుకబడిపోయిన హీరో కిరణ్ అబ్బవరం. తన చివరి చిత్రం 'మీటర్' దారుణమైన ఫలితాన్నందుకుని కిరణ్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది. ఈ యువ కథానాయకుడు నటించిన కొత్త సినిమా 'రూల్స్ రంజన్'కు ఒక దశలో మినిమం బజ్ కనిపించలేదు. కానీ 'సమ్మోహనుడా' పాట.. అందులో హీరోయిన్ నేహా శెట్టి గ్లామర్.. ఫన్నీగా సాగిన ట్రైలర్ ప్రేక్షకుల దృష్టిని కొంత ఆకర్షించాయి. సరైన రిలీజ్ డేట్ కోసం చూస్తున్న టీం 'సలార్' ఖాళీ చేసిన సెప్టెంబరు 28వ తేదీకి తమ చిత్రాన్ని షెడ్యూల్ చేసిన సంగతి తెలిసిందే. 'సలార్' వాయిదా వార్త బయటికి వచ్చిన కొన్ని గంటల్లోనే హడావుడిగా డేట్ ఇచ్చేసింది 'రూల్స్ రంజన్' టీం. కానీ ఆ వీకెండ్‌కు పోటీ బాగా పెరిగిపోవడంతో ఇప్పుడు భయపడి వెనక్కి తగ్గింది. 'స్కంద'బీ 'చంద్రముఖి-2'బీ 'పెదకాపు' లాంటి సినిమాల మధ్య 'రూల్స్ రంజన్' పడితే ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడం కష్టమే. అందుకే సినిమాను వారం వాయిదా వేశారు. అక్టోబరు 6న తమ చిత్రం రిలీజ్ కానున్నట్లు కొత్తగా ప్రకటించారు. ఆ రోజుకు ఆల్రెడీ 'మామా మశ్చీంద్ర', 'మంత్ ఆఫ్ మధు' సినిమాలు షెడ్యూల్ అయినప్పటికీ.. వాటి వల్ల మరీ ప్రమాదం లేదు. కిరణ్‌కు ఈ సినిమా సక్సెస్ కావడం చాలా చాలా అవసరం. ఇది తేడా కొడితే తన కెరీర్ క్లోజ్ అయిపోయినట్లే.తనతో పాటు దర్శకుడు జ్యోతికృష్ణ సైతం 'రూల్స్ రంజన్'పై చాలా ఆశలే పెట్టుకున్నాడు. లెజెండరీ ప్రొడ్యూసర్ ఎ.ఎం.రత్నం తనయుడైన జ్యోతికృష్ణ గతంలో 'నీ మనసు నాకు తెలుసు'బీ 'ఆక్సిజన్' లాంటి డిజాస్టర్లు తీశాడు.

చాలా గ్యాప్ తీసుకుని అతను డైరెక్ట్ చేసిన ఈ చిత్రం హిట్ కావడం తనకూ చాలా అవసరం. ట్రైలర్‌ను బట్టి చూస్తే 'రూల్స్ రంజన్' మంచి కామెడీ ఎంటర్టైనర్ లాగే కనిపిస్తోంది.

## పుష్ప దెబ్బకి సింగం వెనకడుగు



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప 2 ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోన్న ఈ మూవీపై దేశ వ్యాప్తంగా అంచనాలు ఉన్నాయి. అందుకు తగ్గట్లుగానే ఈ మూవీ ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్ కి విశేషమైన రెస్పాన్స్ వచ్చింది. రీసెంట్ గా పుష్ప సినిమాలో పుష్ప రాజ్ పాత్రకిగాను అల్లు అర్జున్ కి బెస్ట్ యాక్టర్ గా నేషనల్ అవార్డు వచ్చింది. దీంతో పుష్పరాజ్ పాత్రపై వెయిటేజ్ పెరిగిందని చెప్పాలి. దీంతో సుకుమార్ మరింత బాద్యత తీసుకొని పుష్ప రాజ్ పాత్రని ప్రేక్షకులకి బలంగా రీచ్ చేయాలని ఫిక్స్ అయ్యారు. షూటింగ్ ఆలస్యం అవుతున్న పెర్ఫెక్షన్ కోసం ఎక్కువ టైం తీసుకుంటున్నారు. ఇక అల్లు అర్జున్ కూడా తనకొచ్చిన పాన్ ఇండియా ఇమేజ్ ని మరింత స్ట్రాంగ్ గా ఎస్టాబ్లిష్ చేసుకోవాలని చూస్తున్నాడు. ఇక పుష్ప 2 కోసం దేవిశ్రీ ప్రసాద్ కూడా గట్టిగానే కష్టపడుతున్నారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ఎనౌన్స్ చేశారు. వచ్చే ఏడాది ఆగష్టు 15న రిలీజ్ చేయనున్నట్లు పోస్టర్ తో కన్ఫర్మ్ చేశారు. అయితే అదే సమయంలో హిందీలో రోహిత్ శెట్టి సింగం సిరీస్ లో మూడో భాగం రానుంది. ఎప్పుడో ఆగష్టు 15 వీకెండ్ లో రావాలని రోహిత్ శెట్టి ప్లాన్ చేసుకున్నారు. సింగం అగైన్ టైటిల్ తో రాబోయే ఈ మూవీకి హిందీలో మంచి ఫ్యాన్ బేస్ ఉంది. అయితే పుష్ప 2తో పోల్చుకుంటే మాత్రం సెకండ్ ఛాయస్ అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది. అంతగా నార్త్ ఇండియన్స్ పుష్పకి అడిక్ట్ అయిపోయారు. ఈ నేపథ్యంలో పుష్ప 2తో పోటీ పడటం ఎందుకని ఆలోచించి మరో డేట్ ఫిక్స్ చేసుకునే పనిలో రోహిత్ శెట్టి టీం ఉంది. పుష్ప2తో పోటీ పడితే కచ్చితంగా కలెక్షన్స్ పరంగా ఎఫెక్ట్ ఉంటుందని ముందుగానే జాగ్రత్త పడుతున్నారు. ఒక వేళ సింగం అగైన్ మూవీ వాయిదా పడిన పుష్ప 2కి పోటీగా శంకర్ ఇండియన్ 2 ఉండే ఛాన్స్ ఉంది. ఈ మూవీ అదే టైంలో రిలీజ్ అయితే కొంత టఫ్ ఫైట్ ఉంటుంది. కోలీవుడ్ లో మాత్రం మొదటి ప్రాధాన్యత ఇండియన్ 2కి ఉంటుంది. ఇక మిగిలిన భాషలలో పుష్ప 2 ఫస్ట్ ఛాయస్ గా ఉంటుంది. మరి పుష్ప రాజ్ స్పీడ్ ని తట్టుకొని ఎవరైనా పోటీకి నిలబదతారో లేదో తెలియాలంటే వేచి చూడాల్సిందే.

## వామ్మో దక్షా.. ఏంటా అందాలు..!


టాలీవుడ్ యంగ్ హీరోయిన్ దక్ష నగార్కర్ కి పరిచయం అవసరం లేదు. చేసింది చాలా తక్కువ సినిమాలు అయినా, గుర్తింపు మాత్రం చాలా తొందరగానే సంపాదించుకుంది. అయితే, గుర్తింపు వచ్చినా, స్టార్ హీరోయిన్ కాదు కదా, మీడియం రేంజ్ హీరోయిన్ కూడా కాలేకపోయింది. అయితే, ఆమె అందానికి మాత్రం వంక పెట్టే పని లేదు. చూడగానే ఎవరినైనా ఆకర్షించేలా ఉంటుంది. ఎలాంటి క్యారెక్టర్ వచ్చినా, సులభంగా చేయగల సత్తా కూడా ఉంది. అయితే, సినిమాల్లో అవకాశాలు రాకున్నా, సోషల్ మీడియాలో మాత్రం చాలా చురుకుగా ఉంటుంది. తాజాగా కొన్ని ఫోటోలు షేర్ చేయగా, అవి వైరల్ గా మారాయి. సూపర్ మోడల్ లాగా ముస్తాబై కనిపించింది. చాలా స్టైలిష్ గా ఉంది. ఆ డ్రెస్ కూడా స్పెషల్ గా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఇక ఆ డ్రెస్ లో నుంచి తన ఎద అందాలు



క్లియర్ గా కనిపించేలా డిజైన్ చేయడం విశేషం. మరోవైపు థైస్ షో కూడా చేసింది. ఇక, కళ్లకు గాగుల్స్ పెట్టి, హెయిర్ లీవ్ చేసి, స్టైలిష్ గా ఫోజులు ఇచ్చింది. ఓ కాఫీ షాప్ లో ఈ ఫోటోలు దిగినట్లు తెలుస్తోంది. ఆమె ఫోటోలు షేర్ చేసిన గంటల్లోనే అవి వైరల్ గా మారాయి. ఇక, కామెంట్ల గురించి అయితే, స్పెషల్ గా చెప్పర్లేదు. ఆమె అందాలను విపరీతంగా పొగిడేస్తున్నారు. ఇక, దక్ష తొలిసారి హెూరాహెూరీ అనే సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. కానీ, ఆ సినిమా గురించి కూడా ఎవరికీ తెలియకపోవడంతో దక్షకు పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ, ఆ తర్వాత హుషారు అనే మూవీతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ మూవీ క్లిక్ అయినా, దక్షకు పెద్దగా ఛాన్సులు రాలేదనే చెప్పాలి. జాంబిరెడ్డి, బంగార్రాజు వంటి చిత్రాలు హిట్ అయినా, దక్ష కెరీర్ కి ఉపయోగపడేలేదు. రవితేజ రావణాసురలో అవకాశం వచ్చింది కానీ, ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఆ తర్వాత ఆమెకు మళ్లీ ఆఫర్లు రాలేదు. కొత్తగా సినిమా అవకాశాల కోసం ప్రయత్నిస్తోంది. మరి, ఫ్యూచర్ లో ఆమెకు ఎలాంటి అవకాశాలు వస్తాయో చూడాలి.

## కొత్త పద్యం పాడుతున్న వాణీ..ఇలా ఇంకెన్నాళ్లు?

నేటితరంలో పర్ఫెక్ట్ ఫ్యాషన్ సెన్స్ తో అలరిస్తున్న స్టైల్ ఐకాన్ గా వాణీకపూర్ పేరు మార్మోగుతోంది. ఈ బ్యూటీ నిరంతర ఫ్యాషన్ ఎంపికలు, ప్రయోగాలు యువతరంలో అగ్గి రాజేస్తున్నాయి. తాజాగా వాణీ మరో లేటెస్ట్ ఫోటోషూట్ తో విరుచుకుపడింది. చాలా సింపుల్ గా పొడుగు కాళ్ల సౌందర్యాన్ని ఎలివేట్ చేస్తూ డెనిమ్ షార్ట్ ధరించిన ఈ బ్యూటీ లైట్ స్లీవ్ టాప్ ధరించి టూహాట్ గా కనిపిస్తోంది. అయితే అక్కడ వాణీ తన అందాలను కవర్ చేయడానికి ఒక బ్లేజర్ లాంటి కోట్ ని ధరించింది. తాజా ఫోటోషూట్ కి వాణీ అద్భుతమైన క్యాప్షన్ ని కూడా ఇచ్చింది. కొండలలో ఒక నివాసం, చాలా సుందరమైన.. నిర్మలమైన దృశ్యంతో...ఒంటరిగా గంటలు దాటి, ఆకాశం దాటి మేఘాలు .. నశ్వరమైన ఆలోచనలతో, మిస్టరీ తో.. అద్భుత ప్రకాశంతో మళ్లీ ప్రేమలో పడటం ఇదే నా ప్రయాణం అని వాణీ కవితాత్మక వర్ణనను రాసింది. తాజాగా పాపులర్ లైఫ్ స్టైల్ మ్యాగజైన్ ఇంటర్వ్యూలో తన ఫ్యాషన్ ఎంపికలపై వాణి కపూర్ చాలా



సంగతులే చెప్పింది. ఫ్యాషన్ అండ్ ట్రెండ్స్ ఎంపికలు తన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయని వాణీ తెలిపింది. నాలో ఫ్యాషన్ పెద్ద భాగం. నా సృజనాత్మకత, వ్యక్తిత్వం, శైలిని నేను నా ఫ్యాషన్ సెన్స్ ద్వారానే వ్యక్తపరుస్తాను. నా ఫ్యాషన్ ఎంపికలను ప్రజలు మెచ్చుకున్నప్పుడు అది అద్భుతంగా అనిపిస్తుంది.. అని తెలిపింది. ఎడ్జీ నుండి క్లాసిక్ వరకు... డేరింగ్ స్టైల్ నుండి సింపుల్ లుక్ వరకు రకరకాల స్టైల్‌లను అనుకరించగలనని వాణీ తెలిపింది. పాశ్చాత్య లేదా భారతీయ దుస్తుల ఎంపిక ఏదైనా, చేసే పనిలో తన హృదయాన్ని ఆత్మను ఉంచుతానని తెలిపింది. వాణి మాట్లాడుతూ- నా ఫ్యాషన్ సెన్స్ కొత్త విషయాల సమ్మేళనంగా ఉండాలని నేను భావిస్తాను. నేను నా స్వంత పద్ధతిలో దుస్తులు ధరించడాన్ని చాలా ఆనందిస్తాను. నాకు ఆత్మవిశ్వాసం కలిగించడంలో సహాయపడుతుంది. పాశ్చాత్య దుస్తులు ధరించినా లేదా భారతీయ దుస్తులలో ఉన్నా నా హృదయాన్ని అందులో ఉంచుతాను. విభిన్న రూపాలతో ప్రయోగాలు చేయడం నాకు ఇష్టం.. రంగులు ఆకారాలలో ప్రయోగాలు చేస్తాను అని వాణీ తెలిపింది. కపూర్ ఫ్యాషన్ సెన్స్‌ను అభిమానులు తోటి సెలబ్రిటీలు సహా చాలా మంది ప్రశంసించారు. ఆమె అనేక ఫ్యాషన్ మ్యాగజైన్‌లకు ముఖచిత్రంగా ముద్రించబడింది.



## మట్టి గణపతిని పూజిద్దాం..పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యాపేట : మట్టి గణపతిని పూజిద్దాం..పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ రాబోయే వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పిలుపునిచ్చారు. సూర్యాపేట కలెక్టర్ కార్యాలయంలో మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహనే కల్పించేందుకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి..జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్‌లతో కలిసి గిదర్ పోస్టర్ ను ఆవిష్కరించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ..ప్రకృతి హితమే పండగల పరమార్థం అన్నారు. పండగలతో సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా తీసుకోవాల్సిన తరుణమిదేనని స్పష్టం చేశారు. భారతీయ సంస్కృతిలో ప్రకృతి ఆరాధనకే అధిక ప్రాధాన్యత ఉందన్నారు. పండుగుల వెనుకున్న లక్ష్యం కూడా అదే అని మంత్రి పేర్కొన్నారు. కావున వినాయక చవితి ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు సృష్టించే పద్ధతులను పక్కనబెట్టి, పర్యావరణ హిత గణపతులకు ప్రాధాన్యమిచ్చి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, వాతావరణం ను అందిద్దాం అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ నాగేశ్వర రావు, డీఎస్పీ నాగభూషణం, చివ్వెంల జడ్పీటీసీ సంజీవ నాయక్, శ్రీనివాస్ గౌడ్, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీని జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకట్రావు, పీసీబీ ఈ.ఈ సురేష్ బాబు తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో 2 వేల విగ్రహాలు చిన్నవి, 125 పెద్ద విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

## భాజపా రాష్ట్ర కార్యాలయంలో దీక్ష విరమించిన కిషన్‌రెడ్డి



హైదరాబాద్: కేంద్ర మంత్రి, తెలంగాణ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో దీక్ష విరమించారు. కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జావడేకర్ నిమ్మరసం ఇచ్చి ఆయన చేత దీక్షను విరమింపజేశారు. తెలంగాణలో నిరుద్యోగుల సమస్యలపై బుధవారం కిషన్‌రెడ్డి ఇందిరా పార్కు వద్ద 24 గంటల దీక్ష చేపట్టారు. సాయంత్రం 6 గంటల సమయంలో పోలీసులు ఆ ప్రాంగణాన్ని చుట్టుముట్టి ఆయన్ని బలవంతంగా భాజపా రాష్ట్ర కార్యాలయానికి తరలించారు. ధర్నాచౌక్ వద్ద జరిగిన తోపులాటలో కిషన్‌రెడ్డి చేతికి, ఛాతికి గాయాలు కావడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం మరోసారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పరీక్షించారు.

**రాబోయే వంద రోజుల్లో మరిన్ని పోరాటాలు : ప్రకాశ్ జావడేకర్** – నిరుద్యోగుల తరఫున పోరాటం చేసేందుకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జావడేకర్ అన్నారు. దీక్ష నేపథ్యంలో భాజపా కార్యకర్తలు చూపిన తెగువను ఆయన అభినందించారు. ఇప్పటికే వివిధ సందర్భాల్లో భాజపా సత్తా ఏంటో సీఎం కేసీఆర్‌కు చూపించామని పేర్కొన్నారు. కిషన్ రెడ్డి శాంతియుతంగా ధర్నా చేసినా అడ్డుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. తెలంగాణ యువతను మోసం చేశాననే విషయం కేసీఆర్‌కు తెలుసు కాబట్టే.. భయంతో పోలీసులను పంపించారని దుయ్యబట్టారు. రాబోయే వంద రోజుల్లో కేసీఆర్ అవినీతి, అక్రమాలను ప్రజలకు తెలియజేసే కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## కేంద్రం సహకరించకున్నా తెలంగాణ అభివృద్ధిలో దూసుకెళ్తున్నది : మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్ : కేంద్ర సహకరించకపోయినా, నిధులు ఇవ్వకపోయినా అభివృద్ధికి ఆటంకాలు కల్పిస్తున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం అద్భుతంగా అభివృద్ధి చెందుతున్నదని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గురువారం రాష్ట్ర స్థాయి స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ అవార్డులు -2023 విజేతలకు అందజేసి మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో అవార్డులు వచ్చిన ఈ 40 గ్రామాలు దేశ స్థాయిలో కూడా అవార్డులు గెలుచుకోవాలని ఆకాంక్షించారు. నేడు రాష్ట్ర స్థాయిలో అవార్డులు తీసుకున్న ప్రతి గ్రామ పంచాయతీకి రూ.10 లక్షలు చొప్పున ప్రోత్సాహక బహుమతిగా వెంటనే అంద చేయాలని ముఖ్య కార్యదర్శి, కమిషనర్లను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ మానస పుత్రిక పల్లె ప్రగతి వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. తెలంగాణపై కేంద్రం కక్ష సాధింపుగా వ్యవహరిస్తున్నది. నిధులు నిలిపివేసి వేడుక చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా అంశాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మిగతా రాష్ట్రాలకు సూచించిన కేంద్రం రాష్ట్రానికి అన్ని రంగాల్లో సహాయనిరాకరణ చేస్తున్నదన్నారు. కేంద్రం సహకరిస్తే రాష్ట్రం ఇంకా బాగా అభివృద్ధి చెందేదని పేర్కొన్నారు. భవిష్యత్‌లో తెలంగాణ పల్లెలు మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హనుమంతరావు, సెర్ప్ సీఈవో గౌతం, స్పెషల్ కమిషనర్ ప్రదీప్, ఎస్పీఎం డైరెక్టర్ సురేష్, డిప్యూటీ కమిషనర్లు రామారావు, రవీందర్, యూనిసెఫ్ డైరెక్టర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఈడీ నోటీసును సీరియస్‌గా తీసుకోవద్దు: ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ నోటీసులపై భారాస ఎమ్మెల్సీ కవిత స్పందించారు. నిజామాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈడీ నోటీసులను పట్టించుకోవాల్సిన అవసరంలేదని కొట్టిపారేశారు.“ నాకు మోదీ నోటీసు వచ్చింది. రాజకీయ కక్షసాధింపులో భాగంగా వచ్చిన నోటీసు అది. నోటీసును పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

నోటీసును పార్టీ లీగల్ టీమ్‌కు ఇచ్చాం. లీగల్ టీమ్ సలహా ప్రకారం ముందుకెళ్తాం. ఇది ఏడాది కాలంగా కొనసాగుతూనే ఉంది. టీవీ సీరియల్‌లా దీన్ని కొనసాగిస్తున్నారు. ఎన్నికలు వచ్చాయి.. మళ్లీ ఒక ఎపిసోడ్ రిలీజ్ చేస్తున్నారు. నోటీసును సీరియస్‌గా తీసుకోవద్దు. ఈ విచారణ ఎంతకాలం కొనసాగుతుందో తెలియదు. గతంలో 2జీ విచారణ కూడా చాలా కాలం సాగింది. తెలంగాణ ప్రజలు కూడా దీన్ని సీరియస్‌గా తీసుకోరు” అని కవిత అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవితకు తాజాగా మరోసారి ఈడీ నోటీసులు జారీ చేసింది. శుక్రవారం విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో దినేశ్ అరోరా, అరుణ్ రామచంద్రన్ పిళ్లై, శరత్‌చంద్రారెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డి, మాగుంట రాఘవ తదితర నిందితులు ఇప్పటికే అప్రూవర్లుగా మారారు. ఈ కేసులో మార్చి 16, 20, 21 తేదీల్లో దిల్లీలో కవిత విచారించిన ఈడీ తాజాగా మరోసారి నోటీసులు జారీ చేసింది.

## వస్తే రండి.. లేకపోతే లేదని బీజేపీకి పవన్ తేల్చి చెప్పేశారు

హైదరాబాద్: టీడీపీ – జనసేన పొత్తుపై సీపీఐ నేత నారాయణ స్పందించారు. తమతో వస్తే రండి.. లేకుంటే లేదని పవన్ కళ్యాణ్ బీజేపీకి తేల్చి చెప్పారని అన్నారు. టీడీపీ, జనసేన కలసి పోటీ చేస్తాయని పవన్ తేల్చి చెప్పారన్నారు. చంద్రబాబును అరెస్ట్ చేయించింది కేంద్రంలోని బీజేపీనే అని ఆరోపించారు. బీజేపీ అండదండలు లేకుండా చంద్రబాబును అరెస్ట్ చేయటం జగన్‌కు సాధ్యం కాదన్నారు. ఎంఐఎంకు అన్ని పార్టీలు భయపడినట్టు బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా భయపడుతోందన్నారు.

అందుకే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని, పోరాటంలో పాల్గొన్న పోరాట యోధులను గుర్తించడం లేదని విమర్శించారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సాయుధ పోరాటాన్ని అధికారికంగా చేసినట్టు తెలంగాణ ప్రభుత్వం కూడా రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. గురువారం వైఎమ్‌సీఏ సిగ్నల్ దగ్గర షోయబుల్లాఖాన్ చిత్ర పటానికి నివాళులర్పించిన సీపీఐ నేత.. తెలంగాణ ప్రెస్ అకాడమీకి షోయబుల్లాఖాన్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.




## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా పొలాల పండగ

**వ్యవసాయంలో తమకు నిత్యం తోడుగా ఉండే ఎద్దులను రైతులు దైవంగా భావిస్తారు. దసరా, దీపావళి, బతుకమ్మ కంటే ఘనంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎద్దుల కోసం ప్రత్యేకంగా ఓ పండగ జరుపుకుంటారు. దాన్నే పొలాల పండగ అంటారు.**

## రూ. 788 కోట్ల పెట్టుబడులు పెట్టనున్న సింజీన్ సైంటిఫిక్ సొల్యూషన్స్.. భూమిపూజ చేసిన మంత్రి కేటీఆర్




హైదరాబాద్ : హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలో సింజీన్ సైంటిఫిక్ సొల్యూషన్స్ న్యూ క్యాంపస్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. బెంగళూరుతో పోల్చితే హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అద్భుతంగా డెవలప్ చేశామని తెలిపారు. మంచి రాజకీయ నాయకుల వల్లే మంచి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కంపెనీ విస్తరణ కోసం ఎవరి వెంట తిరగాల్సిన అవసరం లేదు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే అనుమతులు ఇస్తామని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్‌కు హబ్‌గా మారిందన్నారు. గత రెండేండ్లుగా తెలంగాణలో లైఫ్ సైన్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయన్నారు. యూరప్‌తో పోలిస్తే ఇండియాలో లేబర్ ఛార్జీలు చాలా తక్కువ అని తెలిపారు. త్వరలో లైఫ్ సైన్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తామన్నారు. ఏడున్నర ఎకరాల్లో సింజీన్ సైంటిఫిక్ సొల్యూషన్స్ కంపెనీ విస్తరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కంపెనీ హైదరాబాద్‌లో రూ. 788 కోట్ల పెట్టుబడులు పెడుతున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కంపెనీ ద్వారా 1000 మందికి ఉపాధి లభించనుంది. లైఫ్ సైన్సెస్ రంగాల్లో సింజీన్ సైంటిఫిక్ సొల్యూషన్స్ ముఖ్యమైన కంపెనీ అని పేర్కొన్నారు. ఈ కంపెనీ ఏర్పాటుతో హైదరాబాద్ లైఫ్ సైన్స్ రంగం మరింత ముందుకు వెళ్తుందన్నారు కేటీఆర్.

## కుల, మతాల పేరుతో ఓట్లను కొల్లగొట్టేందుకు కేసీఆర్ యత్నం: ఈటల



హైదరాబాద్ : కుల, మతాల పేరిట ఓట్లను కొల్లగొట్టేందుకు ప్రజాధనాన్ని పంపిణీ చేస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడటం తగదని హుజురాబాద్ ఎమ్మెల్యే, ఈటల రాజేందర్ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట్‌లో జరిగిన భాజపా కార్యకర్తల సమావేశానికి జితేందర్ రెడ్డితో కలిసి ఈటల హాజరయ్యారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్ బానిసలను ఓడించి తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని గెలిపించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ముదిరాజ్ వర్గీయులకు అవకాశం ఇవ్వకపోవడాన్ని ఈటల తప్పు పట్టారు.

## ఆర్టీసీ ఉద్యోగులు ఇకపై ప్రభుత్వ ఉద్యోగులు: హరీష్‌రావు




ఖమ్మం జిల్లా: తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు ఇకపై ప్రభుత్వ ఉద్యోగులని, గవర్నర్ తమిళిసై ఆర్టీసీ బిల్లు ఆయోదించటం సంతోషమని మంత్రి హరీష్ రావు అన్నారు. గురువారం ఖమ్మంలోని మంత్రి పువ్వాడ నివాసంలో హరీష్ రావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్ దేనని, పాలమూరుపై ప్రతిపక్షాలు అపశకునాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పాలమూరు ఆపేందుకు ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులు ఎన్నో కుట్రలు పన్నారని, ప్రతిపక్షాలు ప్రజలకు పగోళ్ళలా పని చేస్తున్నారని... పాలమూరు ప్రజలపై పగ సాధిస్తున్నారని.. రాబోయే ఎన్నికలలో నోబెల్స్‌కు గ్లోబెల్స్‌కు మధ్య పోటీ జరగబోతోందని అన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని, డాక్టర్ల ఉత్పత్తిలో కూడా తెలంగాణే నంబర్ వన్ అని హరీష్ రావు అన్నారు. 50 ఏళ్లలో కాంగ్రెస్ ఈ రాష్ట్రానికి, తెలంగాణ ప్రజలకు ఏం చేసిందని ప్రశ్నించారు. బీజేపీ ప్రస్తుతం అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఏంచేస్తున్నారు?.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఫథకాలలో ఒక్కటైనా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా? అని నిలదీశారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ పగటి కలలు కంటోందని ఎద్దేవా చేశారు. సీతారామ ఎత్తిపోతల పనులు చివరి దశలో ఉన్నాయని, మరో మూడు నెలలో పూర్తి అవుతుందన్నారు. ఖమ్మం జిల్లాలో కృష్ణా, గోదావరి జలాలతో ఇక కరువనేదే ఉండదని హరీష్ రావు పేర్కొన్నారు.

## కామారెడ్డిలో కేసీఆర్ పోటీ ఈ ప్రాంత ప్రజల అదృష్టం



కామారెడ్డి: సీఎం కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేయడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణం వంద కోట్ల రుపాయలతో అభివృద్ధి చెందిందన్నారు. 8 కోట్ల రూపాయలతో ఇండోర్ స్టేడియం నిర్మించబోతున్నామని తెలిపారు. మూడో సారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో ప్రజలకి ఇచ్చిన హామీలని అమలు చేయలేక కాంగ్రెస్ పార్టీ చేతులేత్తేసే పరిస్థితిలో ఉందన్నారు. డిక్లరేషన్‌లతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరగుతున్నారన్నారు.

65 సంవత్సరాల ప్రజల గోసని తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ తీర్చారని తెలిపారు. కామారెడ్డి రూపు రేఖలు రెండు, మూడు నెలల్లో పూర్తిగా మారిపోనున్నాయన్నారు. కామారెడ్డి ప్రజలు ఊహకందని మెజారిటిని కేసీఆర్‌కు ఇవ్వాలని కోరారు.

ఏ ఒక్క ప్రాజెక్టు కేంద్రం నుంచి తీసుకురాకుండా లేనిపోని మాటలతో ప్రజలను బీజేపీ నాయకులు మభ్య పెడుతున్నారని మండిపడ్డారు. జమిలి ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ ఎదుర్కొంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

## ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ ఆమోదం హర్షణీయం



కరీంనగర్: టీఎస్‌ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ తమిళిసై ఆమోదం తెలపడం హర్షణీయమని ఎంపీ బండి సంజయ్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. గవర్నర్ తమిళిసై కార్మికుల పక్షపాతి అని తెలిపారు. భవిష్యత్తులో ఏ ఇబ్బంది రాకూడదనే ఆ బిల్లును పూర్తిగా అధ్యయనం చేశారని... అందులోని లోపాలను ఎత్తి చూపారని అన్నారు. ఇది జీర్ణించుకోలేని కేసీఆర్.. గవర్నర్‌కు లేనిపోని దురుద్దేశాలు ఆపాదిస్తూ కించపర్చే కుట్రకు తెరలేపారని మండిడ్డారు. ఆర్టీసీ కార్మికుల్లో లేనిపోని అపోహాలు సృష్టించారని.. అయినప్పటికీ గవర్నర్ వెరవలేదని ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com